

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY ది తెలుగు దినపత్రిక

అవినీతి అంతం – మా పంతం



కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 280 బుధవారం, అక్టోబర్ 28 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

నిజాంపల్లి పాఠశాల ఉపాధ్యాయురాలి సస్పెన్షన్‌పై నిరసన

వ్యక్తిగత కక్షలతోనే చర్యలు తీసుకున్నారంటూ ఆరోపణలు.. నిష్పక్షపాత విచారణకు డిమాండ్

భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి

మంచి విజ్ఞత, క్రమశిక్షణ, అంకితభావంతో పాటు విద్యార్థుల పట్ల ప్రేమ, బోధన పట్ల నిబద్ధతతో ఎన్నో సంవత్సరాలుగా నిజాంపల్లి ప్రభుత్వ పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చిన ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయడంపై నిరసన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సస్పెన్షన్‌కు గురిచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉంటే పూర్తిస్థాయి విచారణ, సహజ న్యాయ సూత్రాలు, వాస్తవ ఆధారాల ఆధారంగానే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పలువురు పేర్కొన్నారు. వ్యక్తిగత ద్వేషాలు, రాజకీయ ఒత్తిళ్లు లేదా ఇతర ప్రభావాలతో చర్యలు తీసుకుంటే విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులను ఇలాంటి చర్యలు నిరుత్సాహపరుస్తాయని, నిజాయితీగా విధులు నిర్వహించే ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దని కోరారు.ఈ ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి వాస్తవాలను



వెలుగులోకి తీసుకురావాలని, వ్యక్తిగత కక్షలు లేదా అనుచిత ప్రభావాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్యాయంగా సస్పెండ్ చేసినట్లు విచారణలో తేలితే ఉపాధ్యాయురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో న్యాయం, పారదర్శకత, ఉపాధ్యాయుల గౌరవం కాపాడినప్పుడే విద్యార్థుల భవిష్యత్తు మరింత బలపడుతుందని పేర్కొంటూ, వెంటనే నిష్పక్షపాత విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు డిమాండ్‌తో యాత్రకు పిలుపు
- ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్‌లో ప్రారంభానికి ముందే ఉద్రిక్తత
- ఎంపీగా తన నియోజకవర్గంలో పర్యటించే హక్కు ఉందన్న ఈటల
- గతంలో ఇదే అంశాన్ని సీఎం రేవంత్ ప్రస్తావించారని గుర్తు చేసిన బీజేపీ ఎంపీ



హైదరాబాద్ :మల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన “మహా పాదయాత్ర”కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారు.పోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు తనకుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి కోరినట్లు వెల్లడించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంటులో మాట్లాడారని ఈటల గుర్తుచేశారు. నాడు రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశంపైనే ఇప్పుడు తాను పాదయాత్ర చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో పాదయాత్ర ముందుకు సాగుతుందా? లేదా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో ఏదులాబాద్‌లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

ఫిర్యాదు చేస్తారా అంటూ ఆగ్రహం

- ఉద్యోగులపై దూషణలు, సస్పెన్షన్ బెదిరింపుల ఆరోపణలు!
- జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ వ్యవహారశైలిపై వివాదం..
- నత్తనడకన విచారణ.. బాధితులకు ఎప్పుడు న్యాయం?

(అదిలాబాద్ జోర్దార్ ప్రతినిధి)

అదిలాబాద్ జిల్లాలో ఒక వ్యవసాయ అధికారి విచారణ జరగగా సదరధికారిని కాపాడడానికి ఆ జిల్లా కలెక్టర్ ఇతర యంత్రాంగం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ డిపార్ట్మెంటల్ విచారణ జరిపించి తప్పు చేసిన జిల్లా వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేయాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారుజిల్లా వ్యవసాయ అధికారి సురేఖ వ్యవహారశైలి వ్యవసాయ శాఖలో చర్చనీయాంశంగా మారింది. తనపై ఫిర్యాదు చేశారనే ఆగ్రహంతో ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, సస్పెండ్ చేయిస్తా, సరెండర్ చేయిస్తా అంటూ బెదిరిస్తున్నారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతున్నప్పటికీ, అది నత్తనడకన సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.“నా మీద కంప్లైంట్ ఇచ్చింది ఎవడు? మొగుడు కానోడు.. కొంచెం గాడే ఫిర్యాదు చేశాడు” అంటూ ఫిర్యాదు చేసిన వ్యక్తిని కించపరిచేలా మాట్లాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగులను “ఇడియట్స్” అంటూ దూషించడంతో పాటు,



ఏకవచనంతో సంబోధిస్తూ అవమానకరంగా మాట్లాడుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.తనకు కలెక్టర్, ఉన్నతాధికారుల మద్దతు ఉందని, తనపై ఎవరూ చర్యలు తీసుకోలేరన్న ధోరణితో మాట్లాడుతున్నారని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు. ఫిర్యాదు చేసిన ఉద్యోగులపై ఒత్తిడి తీసుకురావడం, సస్పెన్షన్, సరెండర్ పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

గతంలోనూ అటెండర్ ఆత్మహత్య ఘటనపై ఆరోపణలు?

గతంలో ఒక అటెండర్ ఆత్మహత్యకు ప్రేరేపించేలా దూషణలు చేశారనే ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. ఈ అంశానికి సంబంధించి అధికారిక ఫిర్యాదులు, పోలీసు కేసు వివరాలు, విచారణ నివేదికలు పరిశీలించాల్సి ఉంది. గత ఘటనకు, ప్రస్తుత ఫిర్యాదులకు మధ్య సంబంధం ఉందా అనే విషయంపై కూడా అందుబాటులో ఆధారాల ఆధారంగా స్పష్టత రావాల్సి ఉంది.

విచారణలో జాప్యంపై ప్రశ్నలు

ఉద్యోగుల ఫిర్యాదులపై విచారణ చేపట్టిన అధికారి ఎంతవరకు పురోగతి సాధించారు? సంబంధిత ఉద్యోగుల వాంగ్మూలాలు సేకరించారా? అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించారా? విచారణ నివేదిక సమర్పించడంలో జాప్యానికి కారణాలేమిటి? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫిర్యాదు లపై విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాల్సిన అవసరం ఉంది. విచారణలో జాప్యం జరుగుతోందనే ఆరోప ణలు నిజమైతే, అందుకు గల కారణాలను ఉన్నతాధికారులు స్పష్టం చేయాలని బాధితులు కోరుతున్నారు.

కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలి

ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత. ఉద్యోగులపై దూషణలు, బెదిరింపులు జరిగినట్లు ఫిర్యాదులు అందితే వాటిని నిర్లక్ష్యం చేయకుండా విచారణ జరిపి, వాస్తవాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.
జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై స్పందించి, విచారణ పురోగతిని వెల్లడించాలని, విచారణను నిర్దిత కాలవ్యవధిలో పూర్తి చేసి నివేదిక ఆధారంగా న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది

- ప్రభుత్వమే కృత్రిమ కరవు సృష్టిస్తోందని కేటీఆర్ ఆరోపణ
- గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శ
- మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని వ్యాఖ్య



హైదరాబాద్:
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయి లో విమర్శలు గుప్పించారు. గోదావరిలో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటిని ఎత్తి పోయకుండా ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రంలో కరవు పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం రైతులను వరి వేయ వద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు.“రాష్ట్రం ప్రస్తు తం పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది” అని కేటీఆర్ మండి పడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా, రాష్ట్రంలో కరవు ఉంటే ప్రభుత్వం మూసీ సుందరీకరణ పనులకు టెండర్లు పిలుస్తోందని ఎద్దేవా చేశారు. మరో ఏడాదిన్నరలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, ప్రజలు ఓపిక పట్టాలని కోరారు.అయితే కేటీఆర్ ఆరోపణల ను కాంగ్రెస్ నేతలు ఖండించారు. కేటీఆర్ వి దొంగ కన్నీళ్లని, గోదావరి జలాలను వృథా ద్వారా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద నీటిమట్టం తక్కువగా ఉన్నందున పంపులను నడపడం సాధ్యం కాదని వారు స్పష్టం చేశారు.

లక్ష రూపాయలకు ఒక ఆదేశం – పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో తాత్కాలిక నియామకాల ముసుగులో లంచాల దందాలి

నగరాల్లో చేరిక, పల్లెల్లో ఖాళీ
– గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తాకట్టు పెడుతున్న అక్రమ తాత్కాలిక ఆదేశాలు

(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి)

1. ఫిర్యాదు సారాంశం ఏమిటి:

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలలో బదిలీలు పూర్తయిన వెంటనే మళ్లీ అడ్డగోలుగా తాత్కాలిక పని ఆదేశాలు జారీ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. కొందరు ఉన్నతాధికారులు ఒక ఉద్యోగి నుండి లక్ష రూపాయల వరకు లంచం తీసుకుని, తమకు ఇష్టమైన హైదరాబాద్, వరంగల్ నగరాలకు పంపిస్తున్నారని, దీని వల్ల వెనుకబడిన ప్రాంతాల్లోని సంస్థలు ఖాళీ అయి విద్యార్థులు నష్టపోతున్నారని ఫిర్యాదు.

2. హేతుబద్ధీకరణ లేకపోవడమే అసలు కారణం:

రాష్ట్రంలోని అన్ని పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో హేతుబద్ధీకరణ జరగలేదు. దీంతో కొన్ని సంస్థల్లో ఎక్కువ ఉద్యోగులు ఉండగా, మరికొన్నింటిలో చాలా తక్కువ మంది ఉన్నారు. ఈ అసమానతను అదునుగా చేసుకుని, హైదరాబాద్ మరియు వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకుల పరిధిలోని అధికారులు ఇష్టారాజ్యంగా తాత్కాలిక ఆదేశాలు ఇస్తున్నారు.

3. నిజామాబాద్ పాత సంస్థలో ఆశ్చర్యకర పరిణామం:

వరంగల్ ప్రాంతీయ ఉప సంచాలకుల పరిధిలోని నిజామాబాద్ పాత పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఐదు సాంకేతిక సహాయక ఉద్యోగాలు ఉన్నాయి. లిఖితీవల పదోన్నతిపై ఐదుగురు అక్కడికి వచ్చారు. ఇదే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, వచ్చిన వెంటనే అందులో ఇద్దరు వ్యక్తులు మళ్లీ పదోన్నతి పొంది తాత్కాలిక ఆదేశాలపై వెళ్లిపోయారు. ఒకరు పెద్దపల్లి సంస్థకు, మరొకరు మనోజ్ కుమార్ అనే వ్యక్తి వరంగల్ సంస్థకు వెళ్లడంతో, నిజామాబాద్ పాత సంస్థలో విద్యుత్ పని నేర్పే వారే లేకుండా పోయారు. బోధించే నాథుడే కరువయ్యాడు. రాగానే వెళ్లిపోవడం వెనుక భారీ లంచం దండా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

4. విద్యార్థులకు జరుగుతున్న అన్యాయం:

హైదరాబాద్ లోని ఉపాధి శిక్షణ శాఖ అధికారులు బదిలీలు అయ్యాక మళ్లీ తాత్కాలిక ఆదేశాలు వేయడం వల్ల చాలా సంస్థల్లో పాఠాలు జరగడం లేదు.లి ప్రయోగశాలలు నడవడం లేదు. సహాయ శిక్షణాధికారులు, శిక్షణాధికారులు తమ స్వార్థం కోసం ప్రాంతీయ సంచాలకులను తప్పుదోవ పట్టించి, ప్రధానాచార్యులకు లంచాలు ఇచ్చి బలవంతంగా తాత్కాలిక ఆదేశాలు పొందుతున్నారు.
వరంగల్, హైదరాబాద్ జిల్లాలు తప్ప మిగతా చాలా జిల్లాల్లో ఉద్యోగాల ఖాళీలు ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ చదివే విద్యార్థులకు పాఠ్య ప్రణాళిక పూర్తి కావడం లేదు, ప్రయోగాలు దొరకడం లేదు, సిద్ధాంత తరగతులు జరగడం లేదు. దీంతో వారి నైపుణ్యాలు లోపిస్తున్నాయి.

5. మా ప్రధాన డిమాండ్లు:

అ) వరంగల్, హైదరాబాద్ ప్రాంతీయ ఉప సంచాలకుల పరిధిలో జారీ చేసిన అన్ని అక్రమ తాత్కాలిక పని ఆదేశాలను వెంటనే రద్దు చేయాలి.
ఆ) లంచాలు తీసుకుని ఆదేశాలు ఇస్తున్న ఉన్నతాధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.
ఇ) రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో వెంటనే హేతుబద్ధీకరణ చేపట్టాలి.
ఈ) ఖాళీగా ఉన్న గ్రామీణ ప్రాంత సంస్థలకు సిబ్బందిని పంపి, విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠాలు, ప్రయోగాలు అందేలా చూడాలి.

కలెక్టర్ గారు ప్రభుత్వ భూముల అక్రమ ఆక్రమణలు

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి





బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల హనుమాన్ విగ్రహం వద్ద, జాతీయ రహదారిని అనుకొని, ఉన్న ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే ఆక్రమించుకుంటూ అక్రమంగా నిర్మాణాలు చేపడుతుంటే, స్థానిక రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఆక్రమణదారుల పనులు మరింత సులువుగా కొనసాగుతున్నాయి. గతంలో ఫిర్యాదులు అందిన వెంటనే తూతూ మంత్రంగా కూల్చివేతలు చేసిన ఆక్రమణదారులు యధావిధిగా బిల్డింగులు నిర్మిస్తూనే ఉన్నారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనీ, సోలార్ పవర్ పంపిచే పోల్స్ ను సైతం అక్రమించి ఇండ్ల నిర్మాణం చేపట్టిన అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని,ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి మొదట అధికారులపై, అనంతరం ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ స్థలాలు,రహదారి పరిధి,విద్యుత్ మౌలిక సదుపాయాలకు సంబంధించిన భూములపై ఎవరైనా అక్రమంగా ఆక్రమణలకు పాల్పడితే, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలనీ, స్థానిక రెవెన్యూ అధికారులు విధుల నిర్వహణలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్న తీరుపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

నక్సలైట్లు లేరనే, అటవీశాఖ అధికారులు

ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు

■ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:నక్సలైట్లు లేరని, నక్సలిజం అంతరించి పోయిందని, అటవి ప్రాంతాల్లోనీ ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల ఆగడాలకు అడ్డు, అదుపు, లేకుండా పోతుందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ అన్నారు.
కొమురం భీం 86వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడారు, ఒకప్పుడు నక్సలైట్లు అడవిలో ఉన్నప్పుడు అడుగు పెట్టడానికే వనికిపోయిన అధికారులు, నేడు అమాయక ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు, అటవీశాఖ అధికారులు ఏజెన్సీలో మనుషుల కంటే ముఖ్యంగా జంతువులకే ప్రాధాన్యత ఇస్తున్నారని, తాను ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎమ్మెల్యేని కావడంతో నిధుల విడుదలలో కూడా ప్రభుత్వం వివక్షత చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
అడవులను కాపాడుతున్నది అధికారులు కాదని, అడవుల్లో ఉండే ఆదివాసీలేనని, అడవులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆదివాసీలపై అటవీశాఖ అధికారుల జులుము మితిమీరి పోతుందని, అడవిలో నక్సలైట్లు ఉన్నప్పుడు ఏ ఒక్క అటవీశాఖ అధికారి అయిన అడవిలోకి వచ్చారా అంటూ సభకు హాజరైన ప్రజలను ప్రశ్నించగా, లేదు లేదు అంటూ సమాధానం ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.
అటవీ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
మహారాష్ట్ర ప్రభుత్వం జంగుబాయి దేవస్థానానికి బ్రిడ్జి నిర్మించి రోడ్డు సౌకర్యం కల్పిస్తే, స్థానిక అధికారులు బిటి రోడ్డు మంజూరు అయితే నిర్మించనియడం లేదని, మహారాష్ట్రలో ఒక జీవో, తెలంగాణలో ఒక జీవో ఉంటుందా! అని ఆమె ప్రశ్నించారు.
రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో మంగి, గుండాల, వంటి ప్రాంతాల్లో గర్భిణీలను మంచాలపై మోసుకెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, రోడ్లు వేయలేని పరిస్థితి కల్పిస్తే కనీసం స్థానిక ప్రజలనైనా వేరే చోటికి తరలిద్దామా!

అని ప్రశ్నించారు.
మంత్రులు సీతక్క, అల్లూరి లక్ష్మణ్ ల పై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని, ప్రజాసేవ చేయలేనప్పుడు మంత్రి పదవులు ఎందుకని, ప్రస్తుత కరువు పరిస్థితుల్లో ప్రజలకు మంచినీరు అందివ్వడానికి నిధులు కేటాయించకపోతే ఎలా అని, ప్రత్యేకంగా నిధులు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు,
ఇది మంత్రులను విమర్శించడం కాదని, నిధులు రావాలన్నదే నా విజ్ఞప్తిని అన్నారు.

ఉచిత కంటి, వైద్య శిబిరం నిర్వహించడం

ఎంతో అభినందనీయం

■ బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:మంచిర్యాల జిల్లా భీమిని మండల కేంద్రంలో శ్రీరామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్, ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, వైద్య శిబిరం నిర్వహించడం ఎంతో అభినందనీయమని బెల్లంపల్లి మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వైద్య శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ, పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించడం, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.
ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ శిబిరంలో 127 మంది పరీక్షలు నిర్వహించుకోగా 27 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్స అవసరం ఉందని నిర్ధారించారని, వీరికి బెల్లంపల్లి లైన్స్ క్లబ్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయిస్తామని శ్రీ రామ సేవా సమితి అధ్యక్షులు పోతరాజుల లక్ష్మణ్ తెలిపారు.
ఈ కంటి పరీక్ష శిబిరంలో కాగజ్ నగర్ కు చెందిన కిమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కాగజ్నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కొత్తపల్లి అనిత, టెక్నీషియన్స్ దత్త గౌడ్, ఎండి గౌస్ భాను ప్రకాష్,లు పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో లైన్ కట్కూరి సత్య నారాయణ, కజ్జం రమేష్, బారాస నాయకులు నిరంజన్ గుప్తా, భీమిని సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, పోతురాజుల రాజయ్య, బలగం సంతోష్, సుదర్శన్ గౌడ్, మహేష్ గౌడ్, రమేష్, భానేష్, ప్రదీప్, లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భారత్ ఏక్తా దివస్ జాతీయ వేడుకలకు

గుంటూరుపల్లి సర్పంచ్ నాగమల్లేశ్వర్ రావు ఎంపిక



జోర్దార్ ప్రతినిధి చిట్యాల / భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం గుంటూరుపల్లి గ్రామ సర్పంచ్ గుంటుపల్లి నాగమల్లేశ్వర్ రావుకు అరుదైన అవకాశం లభించింది. గుజరాత్ రాష్ట్రంలోని కెవాడియా (ఏక్తా నగర్)లో ఈ నెల 31న నిర్వహించనున్న 'భారత్ ఏక్తా దివస్' జాతీయ వేడుకలకు ఆయన ఎంపికయ్యారు.
సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన పది నెలల్లోనే గ్రామంలో డిజిటల్ సేవలు, పారిశుధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పోలీసు శాఖ సహకారంతో 100 శాతం హెల్మెట్ నిబంధన అమలుకు చొరవ చూపినట్లు సమాచారం. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారం,పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవకాశం లభించినట్లు పేర్కొన్నారు.ఈ నెల 28న జిల్లా నుంచి ఎంపికైన ఐదుగురు వివిధ రంగాల ప్రముఖులు, నోడల్ అధికారితో కూడిన బృందంతో కలిసి నాగమల్లేశ్వర్ రావు గుజరాత్‌కు బయలుదేరనున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయం, పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆహ్వాన సమాచారం అందినట్లు తెలిపారు. జాతీయ స్థాయి కార్యక్రమానికి ఎంపిక కావడంపై నాగమల్లేశ్వర్ రావు హర్షం వ్యక్తం చేశారు. తనకు సహకరించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా ఎస్పీ, కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మండల అధికారులు, గుంటూరుపల్లి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.
ఆయన ఎంపికపై ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పర్దీపురం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉపేందర్ గౌడ్ (17) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పొలంలో విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. విద్యుత్ షాక్‌కు గురైన ఉపేందర్ గౌడ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా,చిన్న వయస్సులోనే యువకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.
ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నాలుగో ప్యానెల్ అనుమతులపై దృష్టి

అడ్రియాల గనిలో సీఎంపీడీఐ బృందం తనిఖీలు



■ భద్రతా ప్రమాణాలు, సాంకేతిక ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన

సింగరేణి జోర్దార్ ప్రతినిధి:సింగరేణి సంస్థకు కీలకమైన అడ్రియాల లాంగ్‌వాల్ గనిలో నాలుగో ప్యానెల్ ఏర్పాట్లపై సీఎంపీడీఐ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్యానెల్‌కు అవసరమైన అనుమతుల ప్రక్రియలో భాగంగా మంగళవారం సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంపీడీఐ) జనరల్ మేనేజర్ శంభుశరణ్ నేతృత్వంలోని అధికారుల బృందం గనిని సందర్శించింది.ఈ సందర్భంగా నాలుగో ప్యానెల్‌లో ఇప్పటికే ఏర్పాటు చేసిన, ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న సహాయక ఆధార వ్యవస్థలను బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. భూగర్భ గనిలో భద్రతకు సంబంధించిన ప్రమాణాలు, సాంకేతిక ఏర్పాట్లు, ప్యానెల్ నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలపై క్షేత్రస్థాయిలో సమీక్షించింది.నాలుగో ప్యానెల్‌కు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఈ తనిఖీకి ప్రాధాన్యం ఉంది. గనిలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అంశాలను అధికారులు సమీక్షించారు.ఈ తనిఖీలో సీఎంపీడీఐ అధికారులు పమేంద్ర కుమార్ సింగ్, పవన్ కుమార్, రాఘవేంద్ర ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు. వీరితోపాటు అడ్రియాల ప్రాజెక్టు ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, భూగర్భ గనుల విభాగం జనరల్ మేనేజర్ కె. యాదయ్య, ఎస్ఓ టు జీఎం బండి సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ దూప్ సింగ్, ప్రాజెక్టు అధికారి కె. జనార్ధన్, ప్రాజెక్టు ఇంజనీర్ బాలరాజు, మేనేజర్ పెంచలయ్య, వీఓ సమద్, జెంకో అధికారులు నరసింహం, బల్ల శ్రీధర్, రంజిత్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల స్థలాల్లో

గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు



■ ఎన్నికల బిజీలో అధికారులు, అక్రమార్కులను అడ్డగించే నాధుడే లేడా ?

■ కుంజ శ్రీను



ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో న్యూస్ చింతూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారులు ఎన్నికల బిజీలో ఉండగా, గిరిజనుల భూముల్లో గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, అడ్డుకొనే నాధుడే లేడా అని, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయాన్ని ఆసరాగా చేసుకొని, పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తూ, బహుళంతస్తుల అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా నిర్మిస్తున్నారని, ఎన్నికల బిజీలో ఉన్నామనే సాకుతో అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) నిర్వహణను నిలిపి వేయడంతో, ఏజెన్సీ ప్రాంతంలో రాత్రింబవళ్లు జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని,
గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అక్రమ నిర్మాణాలను నిలిపివేయక పోవడంతో, అదే వ్యక్తులు మరింత రెచ్చిపోయి బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారనీ, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ నిర్మాణాలకు స్థానిక పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయనీ, ఎవరిని ప్రశ్నించినా "ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు ఎన్నికల బిజీలో ఉన్నారు, డిసెంబర్ వరకు ఎలాంటి ఫిర్యాదులు తీసుకోము" అనే నిర్లక్ష్యపు సమాధానాలే చెప్తున్నారని ఆయన మండిపడ్డారు.
చట్టబద్ధమైన ఏజెన్సీలో, 1/70 చట్టం అమల్లో ఉన్నప్పటికీ అధికారుల మౌనం కారణంగా నాన్-ట్రైబల్స్ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, నిబంధనలను ఉల్లంఘించి రంపచోడ వరంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీ విద్యార్థినులకు సైబర్ నేరాలపై

ఎస్ఐ అమూల్య అవగాహన



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:టేకుమట్ల కేజీబీవీలో ఎస్ఐ అమూల్య ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఓటీపీ అడిగితే వెంటనే స్పందించకుండా ముందుగా ఆగి, ఆలోచించి, ధ్రువీకరించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత, బ్యాంకు వివరాలను ఇతరులకు వెల్లడించవద్దని ఎస్ఐ అమూల్య సూచించారు.

ఖర్గే దిష్టిబొమ్మ దహనం చేసిన

బిజెపి కార్యకర్తలు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఆదిలాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోదీపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకులు నిరసన తెలిపి దిష్టిబొమ్మ దహనం చేశారు.
బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానంద్ మాట్లాడుతూ, ప్రధాని గౌరవాన్ని కించపరిస్తే సహించేది లేదన్నారు. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్య విలువలకు లోబడి, బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

బుధవారం,
అక్టోబర్ 28 2026

కొండెక్కిన 'కోడి గుడ్డు'!

- పౌల్ట్రీ రంగంపై ఎల్‌నినో ఎఫెక్ట్
- పెరుగుతున్న దాణా, మండుల ధరలు
- 8 నుండి 10కి చేరే అవకాశం
- విద్యార్థుల పోషకాహారంపైనా ప్రభావం

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:సామాన్యుడి నిత్యావసరాల్లో ఒకటైన కోడి గుడ్డు ధరలు అమాంతం పెరుగుతొందని అందరిలో ఆందోళన వ్యక్తమవుతోంది. పౌల్ట్రీ రంగంపై దాణా, రవాణా, నిర్వహణ ఖర్చుల భారం భారీగా పెరుగుతుండటంతో గుడ్డు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఒక గుడ్డు హోల్‌సేల్ ధర 5:80 పైసలు కాగా రిటైల్ ధర రూ. 7 పలుకుతోంది.

ధరాభారం పెరగడం కారణంగా మరికొద్ది రోజుల్లో ఒక్కో గుడ్డు ధర రూ. 8 నుంచి రూ. 10కు చేరే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో సామాన్య కుటుంబాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల పై కూడా అదనపు భారం పడే ప్రమాదం లేకపోలేదు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ పరిణామం పౌల్ట్రీ వ్యాపారులు, వినియోగదారులు విద్యార్థుల పోషకాహారంపై ఎలాంటి ప్రభావం చూపనుందన్నది చర్చనీయాంశంగా మారింది.



దాణా ధరల సెగ.. సరఫరాపై సందిగ్ధం

అమెరికా రష్యా ఉక్రెయిన్ దేశాల మధ్య జరిగిన యుద్ధ వాతావరణం నేపథ్యంలో కొంతమేర పౌల్ట్రీ నిర్వహణలో రవాణా ఖర్చులు పెరిగగా తాజాగా ఎల్నీనో ప్రభావం మరింత ధరలు పెరిగితే గుడ్డు ఉత్పత్తి వ్యయంపై ప్రభావం పడుతుంది. దీంతో చిన్న, మధ్యతరహా పౌల్ట్రీ రైతులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొనే పరిస్థితి. కోళ్ల ఎదుగుదలకు వినియోగించే దాణ సొయా క్వింటల్ రూ 4,600 నుండి ప్రస్తుతం అమాంతం పెరిగి ఏడు వేలకు చేరింది. మక్కలు 2,600 నుండి 3100. నూక పర్రం 1,600 నుండి 2,800లకు డిఓపి (ఫ్రౌడు నుండి వచ్చేది) క్వింటల్ 1,600 నుండి 2,700లకు చేరింది. వేరుశనగ నుండి విడుదలయ్యే డిఓసి 3 వేల నుండి 5,800లకు ఎగబాకింది. డిడిజిఎస్ 1,900 నుండి 4,600 లకు చేరిందని పౌల్ట్రీ రంగం రైతులు పేర్కొంటున్నారు. వీటితోపాటు కోడి ఎదుగుదలకు వ్యాధి నిరోధక టీకాలు మందులు కూడా అమాంతం పెరిగాయని చెప్తున్నారు. ఎంసిబి కిలో 65 నుండి 130కి, లైసిన్ కిలో 110 నుండి 170కి మిథాయిలన్ కిలో 280 నుండి 550 చేరిందని రైతులు వాపోతున్నారు. ఒక్కో కోడి నిత్యం 110 గ్రాముల దాన కావాలని చెప్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద వారంలో మూడుసార్లు విద్యార్థులకు గుడ్లు అందించడంపైనా ధరల ప్రభావం పడే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. తెలంగాణాలో మార్కెట్ ధరలు పెరిగి, ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు చెల్లించే మొత్తం సరి పోకపోవడంతో పాఠశాలల్లో గుడ్ల సరఫరాపై ఇబ్బందులు తప్పెలా లేవని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు లక్ష 30 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ప్రతి వారంలో మూడు చొప్పున గుడ్లు సరఫరా చేస్తున్నారు.జిల్లాలోనూ గుడ్ల సరఫరా కాంట్రాక్టర్లు, పౌల్ట్రీ నిర్వాహకులు, పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ధరల పెరుగుదల కారణంగా విద్యార్థులకు అందించే గుడ్ల సంఖ్య తగ్గకుండా, నాణ్యమైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుండీ గ్రామ బ్రిడ్జి కోసం
యువకుల సైకిల్ యాత్ర



- పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చేరుకున్న యువకులు..
- మద్దతు తెలిపిన ఏఈవో రాష్ట్ర అధికార ప్రతినిధి రవితేజ

పెద్దపల్లి: గుండీ గ్రామ బ్రిడ్జి నిర్మాణం కోసం యువకులు చేపట్టిన సైకిల్ యాత్ర పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చేరుకుంది. రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న బ్రిడ్జి సమస్య పరిష్కారం కోసం యువకులు ఈ యాత్ర చేపట్టి తమ నిరసనను, గ్రామ ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చేరుకున్న యువకులకు రాష్ట్ర అధికార ప్రతినిధి రవితేజ మద్దతు తెలిపారు. గుండీ గ్రామ బ్రిడ్జి నిర్మాణం కోసం యువత చేస్తున్న పోరాటానికి ఆయన సంఘీభావం ప్రకటించారు.

రెండు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని ఈ సమస్యపై సంబంధిత అధికారులు స్పందించి, బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే గ్రామస్తుల రాకపోకలకు సౌకర్యం కలగడంతో పాటు, దీర్ఘకాలంగా ఎదురవుతున్న ఇబ్బందులు తొలగుతాయని ఆశిస్తున్నారు.గుండీ గ్రామ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తమ ప్రయత్నాలను కొనసాగిస్తామని యువకులు పేర్కొంటున్నారు.

లద్నాపూర్‌లో తాగునీటి ప్లాంట్ ప్రారంభం





- గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు
- త్వరలో మంథని ప్రాంతంలో వస్త్ర పరిశ్రమ, ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేస్తాం

రామగిరి, జోర్దార్ ప్రతినిధి:పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లద్నాపూర్ గ్రామంలో బాలవికాస్ సంస్థ, కెనడాకు చెందిన రోంకలి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి, సంస్థ ప్రతినిధులను గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు.

ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు బాలవికాస్ వంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామ కమిటీ సభ్యులు, మహిళలు, స్థానికులు తమ వంతుగా 20 శాతం నిధులు సమకూర్చుకుని తాగునీటి కేంద్రం ఏర్పాటుకు సహకరించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సహకారానికి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.లద్నాపూర్‌తోపాటు పుట్టపాక, ఖానాపూర్, గోపాల్‌పూర్, సూరయ్యపల్లి తదితర గ్రామాల్లోనూ తాగునీటి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

బొగ్గు ప్రాంత ప్రజల త్యాగాలను గుర్తిస్తాం

సింగరేణి బొగ్గు ఉత్పత్తి కోసం మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ ప్రాంతాల ప్రజలు భూములు, ఆస్తులు కోల్పోయి దేశ విద్యుత్ అవసరాల కోసం సహకరిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. బొగ్గు ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని, విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వంపై విమర్శలను పట్టించుకోకుండా ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

మంథనిలో వస్త్ర పరిశ్రమ.. ఫార్మసీ కళాశాల

మంథని ప్రాంతంలో చిన్న తరహా వస్త్ర పరిశ్రమ ఏర్పాటుకు డిసెంబరులో పనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. స్థానిక విద్యార్థులకు సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలు అందించేందుకు అడ్వాన్స్‌డ్ డ్రైవింగ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఫార్మసీ కళాశాల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నవంబర్ 1న స్వామి సచ్చిదానంద స్వామి మంథని నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో ప్రజలు ఆయన ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

శ్రీధర్‌బాబు కృషి అభినందనీయం: ఎమ్మెల్యే రాజ్‌ఠాగూర్

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో మంత్రి శ్రీధర్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.పెద్దపల్లి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి సహకరిస్తున్నారని తెలిపారు. ఎస్సారెస్పీ నీటితో ఉమ్మడి జిల్లాలోని రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారని చెప్పారు. మంథని, రామగుండం ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వారి పక్షాన నిలబడతానని అన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, సర్పంచ్ రామచంద్రరావు, ఉపసర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు చిప్ప లావణ్య, సతీష్, మల్లారపు స్వామి, అడ్డూరి లావణ్య, సురేష్, దుబాషి విజయ, రంగయ్య, బాలవికాస్ సంస్థ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవా భావమే విజయ్‌కుమార్ జీవిత లక్ష్యం



- మాజీ మున్సిపల్ చైర్మన్ సేవలు ఆదర్శప్రాయం ..
- ఘనంగా జన్మదిన వేడుకలు
- ప్రజాకవి, తత్వవేత్త డాక్టర్ నాగుల సత్యంగౌడ్ ప్రశంస...

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజూరాబాద్ మాజీ మున్సిపల్ చైర్మన్ వడ్నూరి విజయ్‌కుమార్ అందించిన నిస్వార్థ సేవలు అందరికీ ఆదర్శప్రాయమని మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షులు, ప్రజాకవి, తత్వవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ నాగుల సత్యంగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అవంతి కన్వెన్షన్ హాలులో విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు పట్టు శాలువా కప్పి, ఆధ్యాత్మిక కవితా జ్ఞాపిక, పూలబొకే అందజేసి సత్కరించారు. అనంతరం కేకు, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా సత్యంగౌడ్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న పేదలకు ఎల్లవేళలా చేతనైన సాయం అందిస్తూ, ప్రజాసేవనే తన జీవిత ధ్యేయంగా ఎంచుకున్న విజయ్‌కుమార్ అభినందనీయులని కొనియాడారు. మున్సిపల్ చైర్మన్‌గా తన పదవీ కాలంలో హుజూరాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడం గర్వకారణమన్నారు. నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరం పరిష్కరించినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. స్వార్థాన్ని వీడి మానవతా దృక్పథంతో మెలిగి మానవ జన్మను సార్థకం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రుద్రారపు రామచంద్రం, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇమ్రాన్, బండ నవీన్, బొడ్డు సంజయ్, తునికి వసంత్, నందగిరి శ్రీనివాస్, బాబురావు, వెంకటస్వామి, శాయిల రాజు, జడల సమ్మయ్య, చందు, ముకుందరెడ్డి, రాజుగౌడ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బీమా, రుణాలపై
అవగాహన కల్పించిన యూనియన్ బ్యాంకు



టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టేకుమట్ల శాఖ ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పచ్చిక దిలీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు వివిధ బీమా పథకాలు, పెన్షన్ పథకాలు, వ్యవసాయ, వ్యాపార రుణాలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనతో పాటు వ్యవసాయ రుణాలు, వ్యాపార రుణాలు పొందే విధానం, వాటి ప్రయోజనాలను బ్యాంకు అధికారులు రైతులకు వివరించారు.

అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీని వాస్, సర్పంచ్ పచ్చిక దిలీప్ రెడ్డి, ఉప సర్పంచ్ నల్లబెల్లి మొండయ్య, డీఆర్‌ఏ, యూనియన్ బ్యాంక్ బీసీ సలిగంటి సంపత్ కుమార్, కన్నూరి ప్రశాంత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గతంలో 80 శాతం.. ఇప్పుడు 10 శాతం

- సింగరేణి మెడికల్ బోర్డు బాధితుల ఆవేదన
- మంత్రి శ్రీధర్‌బాబుకు కార్మికులు, వారసుల వినతి

సింగరేణి, జోర్దార్ ప్రతినిధి:సింగరేణి కార్మికుల వైద్య అనర్హత విషయంలో గత ప్రభుత్వ హయాంలో 80 శాతం వరకు వైద్య అనర్హత కల్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎలాంటి షరతులు లేకుండా వైద్య అనర్హత కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇప్పటివరకు కేవలం 10 శాతం మందికే వైద్య అనర్హత కల్పించినట్లు బాధిత కార్మికులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం అమలవుతున్న విధానానికి మధ్య వ్యత్యాసం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన కార్మికులకు 80 శాతం వైద్య అనర్హత కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు అక్టోబర్ 27న వినతిపత్రం అందజేశారు.

హామీకి.. అమలుకు మధ్య వ్యత్యాసం!

సింగరేణిలో అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్న కార్మికులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని బాధితులు గుర్తుచేస్తున్నారు. ఎలాంటి షరతులు లేకుండా వైద్య అనర్హత కల్పిస్తామని చెప్పినప్పటికీ, ప్రస్తుతం అర్హత సాధించే ప్రక్రియలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు. గతంలో 80 శాతం వరకు వైద్య అనర్హత కల్పించగా, ఇప్పుడు కేవలం 10 శాతమే అమలవుతోందని వారు ఆరోపిస్తున్నారు.

ఈ గణాంకాలకు సంబంధించిన అధికారిక వివరాలు వెల్లడించాల్సిన అవసరం ఉందని కార్మిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



అనారోగ్యంతో అవస్థలు.. కుటుంబాలపై ఆర్థిక భారం

సింగరేణి బొగ్గు గనుల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులు వివిధ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితులు చెబుతున్నారు. ఆరోగ్య పరిస్థితులు సహకరించక విధులు నిర్వహించలేని స్థితికి చేరుకున్నప్పటికీ, వైద్య అనర్హత ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలతో తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని పేర్కొంటున్నారు. కార్మికుడి ఆరోగ్య సమస్య ప్రభావం కుటుంబ ఆదాయంపై కూడా పడుతోందని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

మెడికల్ బోర్డు విధానంలో మార్పులు చేయాలి

కార్మికుల ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, వైద్య పరీక్షల నివేదికలు, వ్యాధుల తీవ్రత, విధులు నిర్వహించే సామర్థ్యం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. మెడికల్ బోర్డు విధానంలో అవసరమైన మార్పులు తీసుకురావడంతోపాటు, అర్హులైన వారికి 80 శాతం వైద్య అనర్హత కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వైద్య అనర్హతకు సంబంధించిన నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, అర్హత ఉన్న కార్మికులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపాలి

తమ సమస్యలను ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని మెడికల్ బోర్డు బాధితులు, కార్మికులు, వారి వారసులు మంత్రి శ్రీధర్‌బాబును కోరారు. గతంలో కల్పించినట్లు 80 శాతం వైద్య అనర్హత అంశాన్ని పరిశీలించి, అర్హులైన కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్య అనర్హతకు సంబంధించిన హామీల అమలుపై స్పష్టతనివ్వాలని, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరారు.

ఎంబిబిఎస్ లో సీట్ సాధించిన నక్క సంతోష్

■ అభినందించి ఆదుకుంటామన్న ఉపాధ్యాయులు.

■ శ్రేయోభిలాషులు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (జోర్దర్ ప్రతినిధి)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం సీతయ్యగూడెం గ్రామపంచాయతీ పరిధిలోనీ టేకుల గుంపు గ్రామానికి చెందిన , నక్కా సంతోష్, 2026-27 విద్యా సంవత్సరంలో (నీట్) పరీక్షలో అర్హత సాధించి, కొడంగల్ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించాడు.

సంతోష్ బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి, అమ్మమ్మ దగ్గర ఉంటూ కూలి పని చేసుకుంటూ చదువును ప్రారంభించిన సంతోష్, పదవ తరగతి దమ్మపేటలోని టి.డబ్ల్యూ.ఆర్.ఎస్. నందు 9.8 పాయింట్ల గ్రేడ్ సాధించాడు, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ రాజేంద్రనగర్ నందు ఇంటర్లో 976 మార్కులు సాధించి మెడికల్ సీట్ కోసం ఎంతో కష్టపడి చదివాడు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా, కష్టపడి చదివి ఎంబిబిఎస్ సీటు సంపాదించడం ఎంతో గొప్ప విషయమని, అలాంటి విద్యార్థికి భరోసా కల్పించాలనే ఉద్దేశంతో స్థానికులు డాక్టర్ బి. డేవిడ్, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు, కే. ప్రభుదాస్, కె.వి.ఆర్. వెజిటేబుల్స్ (సత్తుపల్లి) సతీష్ బుక్ షాప్ వారు, ఆ విద్యార్థికి కావలసిన దుస్తులు, దుప్పట్లు, పుస్తకాలు తదితర సామాగ్రిని అందజేసి ఎంబిబిఎస్ వైద్య విద్యను పూర్తి చేయడానికి తగిన సహకారం అందిస్తామని భరోసా కల్పించారు. ఇకముందు కూడా పేద విద్యార్థులకు చేయూ తనిచ్చి భరోసా కల్పించడం కోసం విద్యార్థులు ఈ క్రింది నంబర్లను సంప్రదించి వారి భరోసాను, సహాయ, సహకారాలను పొందాలని కోరారు. 9154580908, 9949796775, 8309394216.

అందరి ఆశరాభిమానాలు చూరగొన్న బండం సరోజన రెడ్డి



భూపాల్ పల్లి జిల్లా కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన బండశీ సరోజన మరణం తీరని లోటు.ఎవరికి ఏ ఆపద వచ్చిన సహాయం చేసే గుణం వారిది అందరి తలలో నాలుకల వుంటూ గ్రామస్థుల కుటుంబ సభ్యుల మన్ననలు పొందిన వారి మరణం పట్ల గ్రామస్థులు జీర్ణించుకోలేక పోతున్నారు ఈ నెల 22 న అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు మరుసటి రోజు గంగారం లో జరిగిన వారి అంత్య క్రియల్లో వేలాది మంది పాల్గొని వీడ్కోలు పలికారు అయ్యో సరోజనవ్వ పోయావా అంటూ గ్రామస్థులు కన్నీటి పర్యంతం అయ్యారు.ప్రతి ఒక్కరూ గొల్లుమని ఏడ్చారు.గ్రామం అంతా శోక సంద్రం లో మునిగి పోయింది.పలువురు వారి పార్థివ దేహం మీద పూల మాలలు వేశారు రెండు గంటల పాటు వారి శవ యాత్ర జరిగింది.సరోజనకు భర్త బాపు రెడ్డి కుమారుడు సుకుమార్ రెడ్డి సౌజన్య కోడలు మరియు అల్లుడు ఆవుల విజయ్ కుమార్ రెడ్డి స్వప్న బండం మల్ల రెడ్డి రాజీ రెడ్డి కుంభం రాఘవ రెడ్డి వసంత రెడ్డి చీర్ల తిరుపతి రెడ్డి సర్పంచ్ బండఓ శోభ రాణి రామ్ రెడ్డి పాల్గిన్నారు అయిదవ రోజు జరిగిన కార్యక్రమం లో తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి పాల్గొన్నారు అనారోగ్యం తో భాధ పడుతూ అయిదు రోజుల క్రితం మరణించిన సరోజన కుటుంబ సభ్యులని రెడ్డి సంఘం పక్షాన ఓదార్చారు గ్రామం లో అందరి ఆదరాభిమానాలు చూరగొని కలుపు గోలుగా వుండే సరోజన మరణం బాధాకరం అని అన్నారు వారి చిత్ర పటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు వారి వెంట రెడ్డి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ ముద్దసాని పద్మనాభ రెడ్డి బొల్లం విజయ్ పాల్ రెడ్డి అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రతినిధి రామ్ రెడ్డి ఆవుల విజయ్ కుమార్ రెడ్డి స్వప్న భగవాన్ రెడ్డి చల్లా రాజీ రెడ్డి సుకుమార్ రెడ్డి ఉన్నారు

కామిడి సతీష్ రెడ్డి
భూపాల్ పల్లి జిల్లా

తెలంగాణ రియాల్టర్ అసోసియేషన్ హైదరాబాద్ అధ్యక్షులుగా కొట్టే శ్యామ్ రావు



హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి:హైదరాబాద్ జిల్లా తెలంగాణ రియల్ టవర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొట్టే శ్యామ్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం తార్నాకలోని టిఆర్ఏ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం నరసయ్యలు ఆయన నియామకాన్ని ధృవీకరిస్తూ నియామకు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొట్టె శ్యామ్ రావు మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లా పరిధిలో రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్న అసోసియేట్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు . రానున్న నెల రోజులలో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేసి అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తానని కొట్టె శ్యామ్ రావు వెల్లడించారు.తనపై నమ్మకంతో ఈ పదవి బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ గారికి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం నరసయ్య గారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

మంగళవారం తార్నాకలోని తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు నారగోని ప్రవీణ్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం నరసయ్య గారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కొట్టె శ్యామ్ రావు మాట్లాడుతూ హైదరాబాదు పరిధిలో అసోసియేషన్ బలోపేతం చేసి పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవీ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్కు వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం నరసయ్య లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతిభ కనబరిచిన పోలీసులకు రివార్డులు



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి SP అఖిల్ మహాజన్ నగదు రివార్డులు, ప్రశంసపత్రాలు అందజేశారు.

మావల పరిధిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని కాపాడిన డయల్ 100 కానిస్టేబుల్ భుజంగరావు, హోంగార్డు రమేష్ను అభినందించారు. దొంగ వాహనాలు, ఫేక్ నంబర్ ప్లేట్ల గుర్తింపులో ప్రతిభ చూపిన ట్రాఫిక్ సిబ్బందిని ప్రోత్సహించారు. ప్రజల ప్రాణాల రక్షణ, నేరాల నియంత్రణలో అంకితభావంతో పనిచేయాలని అదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

■ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం చెల్లించాలి.

■ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి రాము.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట(జోర్దర్ ప్రతినిధి) జిల్లాలోఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల వల్ల జిల్లాలో రైతులు పంట నష్టాలను ఎదుర్కొంటున్నారని, తక్షణమే జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్,అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) దమ్మపేట మండల కమిటీ ల ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ ని నో కారణంగా తీవ్రమైన వర్షాభావం కొరతతో రైతాంగం వేసిన పంటలు ఎండిపోయి రైతాంగం తీవ్ర నష్టానికి గురయ్యారని, రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రాష్ట్రంలో కరువును ప్రకటించి, కేంద్ర ప్రభుత్వ సహాయం కోరి రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తో పాటు ఖమ్మం జిల్లాలో సాధారణంతో పోలిస్తే సుమారు 30నుంచి 50 శాతం తక్కువ వర్షపాతం నమోదవడంతో వరి, పత్తి, కంది తదితర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల రూపంలో రైతులు పెట్టిన పెట్టుబడులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేతికి రాకపోవడంతో బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను ఎలా చెల్లించాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని, వర్షాధార వ్యవసాయంపై ఆధారపడి జీవించే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగాన్ని కరువు పరిస్థితుల నుంచి కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకు ఆర్థికంగా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వాలు తక్షణమే జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి వరి పంటకు ఎకరాకు 30 వేలు,పత్తి, కంది తదితర వాణిజ్య పంటలకు ఎకరాకు 50 వేల రూపాయ నష్టపరిహారం చెల్లించాలనీ, పంట రుణాలను రద్దు చేయాలనీ,తదుపరి సాగు కోసం బ్యాంకుల ద్వారా కొత్త రుణాలు మంజూరు చేయాలనీ, వర్షాభావ పరిస్థితుల వల్ల పశువులకు మేత కొరత ఏర్పడకుండా ప్రభుత్వం ఉచిత పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావాలనీ,ఆరుతడి పంటలకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలనీ, కరువు పరిస్థితులను తట్టుకొని పండించగల ఆరుతడి పంటల సాగు కోసం రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేయాలనీ డిమాండు చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు తోడం దుర్గమ్మ, మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, పండురి వీరబాబు, కుంజ కాంతారావు, తామ రాముడు, కేసరి వెంకటేష్, తెల్లం నాగేష్, పద్దం లక్ష్మయ్య, కుర్సం నగేష్, కురసం సీతారాములు, తాటి శ్రీను, ఇంటికి చిన్న నాగులు, ఇంటికి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశం విజ్ఞానం వైపు - కొందరు విద్యా వంతులు మూఢత్వం వైపు మార్గదర్శులే తప్పుదారి పడితే సమాజం ఏమి కావాలి?

■ వాస్తు, జ్యోతిషం పేరుతో మూఢనమ్మకాల వ్యాపారం - జ్యోతిష్యం లో పట్టా పొందిన ఉపాధ్యాయుడిపై జన విజ్ఞాన వేదిక ఆగ్రహం

(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి ,)

1. విజ్ఞానం అభివృద్ధికి - మూఢత్వం అధోగతికి:
దేశం విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోంది. శాస్త్రీయ విజ్ఞానం ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తోంది. ఇలాంటి సమయంలో శాస్త్రీయంగా నిరూపణ కాని వాస్తు, జ్యోతిషం వంటి అంశాలు ప్రజలను మూఢనమ్మకాల వైపు నడిపిస్తున్నాయని మేధావులు ఆందోళన చెందుతున్నారు.

2. భయాన్ని అమ్ముకునే వ్యాపారం:
వీటిని ప్రచారం చేసే కొందరు ప్రజల బలహీనతలు, భయాలు, ఆశలను ఆసరాగా చేసుకుని తప్పుదారి పట్టిస్తూ వ్యాపారం చేయడం అత్యంత ఆందోళనకరమని జన విజ్ఞాన వేదిక పేర్కొంది. ప్రజల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించింది.

3. ఉపాధ్యాయులే పట్టాలు పొందడం దిగ్భ్రాంతికరం:
ఇటీవల కాలంలో చదువుకున్న వారు, ఉద్యోగులు, ముఖ్యంగా సమాజానికి మార్గదర్శకులుగా ఉండాల్సిన ఉపాధ్యాయులే ఇలాంటి అంశాల్లో శిక్షణ పొంది పట్టాలు పొందడం ఆందోళన కలిగిస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక ఉపాధ్యాయుడు వాస్తు, జ్యోతిషానికి సంబంధించిన అంశంపై ఆచార్య పట్టా పొందడం గమనార్హం.

4. ఇది సమాజానికి ఏం సందేశం ఇస్తుంది:
విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాల్సిన ఉపాధ్యాయులే శాస్త్రీయ ఆధారాలు లేని అంశాలపై ఉన్నత చదువులు చదవడం సమాజానికి ఎలాంటి సందేశాన్ని ఇస్తుందో బుద్ధిజీవులు ఆలోచించాలని జన విజ్ఞాన వేదిక కోరింది.

5. విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి:
విజ్ఞానం ప్రజల అవసరాలను తీరుస్తూ సమాజాన్ని అభివృద్ధి వైపు నడిపించాలి. అందుకే శాస్త్రీయ విజ్ఞానాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. మూఢనమ్మకాలను పెంచే అంశాలకు చదువుల వ్యవస్థలో ప్రాధాన్యత ఇవ్వకుండా, చదువుకున్న వారు, ముఖ్యంగా ఉపాధ్యాయులు శాస్త్రీయ దృక్పథాన్ని ఆచరించి, విద్యార్థుల్లోనూ పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక కోరింది.

6. సంయుక్త ప్రకటన విడుదల:
ఈ మేరకు ఉమ్మడి కరీంనగర్ జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సమన్వయకర్త సి. రామరాజు, రాష్ట్ర సంఘ సభ్యులు సిలువేరి సంపత్ కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షులు ప్యారం లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ధ్యావనపల్లి శ్రీహరి ఒక సంయుక్త ప్రకటనలో పత్రికలకు వెల్లడించారు.

కరీంనగర్ నర్సింగ్ కళాశాలలో ఇబ్బందులు అరికడతాం!

■ విద్యార్థులు, తల్లిదండ్రులు నేరుగా సంప్రదించాలి..

■ ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ

హైదరాబాద్, జోర్దార్ నర్సింగ్ ప్రతినిధి:కరీంనగర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ తెలిపారు. కళాశాలలో ఎవరైనా అక్రమాలకు పాల్పడినా, విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినా, బెదిరింపులకు గురిచేసినా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యం
విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన విద్యాబోధన కల్పించేందుకు కృషి చేస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినులకు లేదా వారి తల్లిదండ్రులకు ఏవైనా సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు
కళాశాలలో ఎవరైనా విద్యార్థినులను బెదిరించి డబ్బులు వసూలు చేసినా, ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ చేస్తామని భయపెట్టినా ఉపేక్షించబోమని లిల్లీ మేరీ హెచ్చరించారు. కింది స్థాయి అధ్యాపకులు లేదా సిబ్బందిలో ఎవరైనా తప్పులకు పాల్పడినట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

త్వరలో కొత్త భవనంలోకి హాస్టల్
విద్యార్థినులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు త్వరలోనే హాస్టల్‌ను కొత్త భవనంలోకి తరలించనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి, భద్రతకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాలలో పారదర్శకమైన పాలన అందించేందుకు, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఆదిలాబాద్ లో 15వ రోజుకు ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల నిరసన



ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలనే ప్రధాన డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె, మంగళవారానికి 15వ రోజుకు చేరింది. అటెండర్ నుండి డాక్టర్ వరకు జిల్లా స్థాయి సిబ్బందితో మొత్తం 78 క్యాడర్లలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని, దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు .

క్షేత్రానికి రాని అధికారులు - రాజధాని లోనే తిష్ట

రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ బడుల్లో పక్షపాత పాలన



■ సీనియర్లకు మొండి చెయ్యి - జూనియర్లకు అందలం - నచ్చిన వారికే ప్రత్యేక రాయితీలు - నర్సింగ్ లో అంతా రాజకీయమే

(హైదరాబాద్ జోర్దార్ ప్రతినిధి)

1. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ప్రైవేటు దోపిడీ - సొమ్ము ఇస్తేనే ఉత్తీర్ణత అనే బెదిరింపు:
రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ప్రయోగశాల రుసుము, దుస్తుల రుసుము, పుస్తకాల రుసుము పేరుతో విద్యార్థుల నుండి అక్రమంగా సొమ్ము వసూలు చేస్తున్న తీరు విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్రభుత్వం నుండి నిధులు రావడం లేదని సాకు చెబుతూ, సొమ్ము కడితేనే పరీక్షల్లో ఉత్తీర్ణత చిహ్నాలు వేస్తామని, లేదంటే తప్పించి జీవితం నాశనం చేస్తామని విద్యార్థులను బెదిరిస్తున్నారనే ఆరోపణలు రాష్ట్రమంతా వెల్లువెత్తుతున్నాయి.

2. ఫిర్యాదు చేసినా పట్టని యంత్రాంగం:
అక్రమ వసూళ్లపై విద్యార్థి సంఘాలు జిల్లా పాలనాధికారులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎక్కడా చర్యలు లేవు. ఫిర్యాదు చేసిన వారినే తిరిగి ఇబ్బంది పెడుతున్నారని, యంత్రాంగం నిద్రపోతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

3. అసలు రోగం - రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్ర పర్యవేక్షణ శూన్యం:
రాష్ట్రంలోని నర్సింగ్ కళాశాలల్లో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేసే ఉన్నతాధికారులే కనిపించడం లేదు. ఉత్తర తెలంగాణ, దక్షిణ తెలంగాణ అనే తేడా లేకుండా అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి. విద్యార్థులకే కాదు, తమకు కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయని, తమ బాధలు ఎవరితో చెప్పుకోవాలని ప్రధానాచార్యులు మొరపెట్టుకుంటున్నారు.

4. సీనియర్లకు అన్యాయం - జూనియర్లకు అందలం:
ఆరు నెలల క్రితమే సేవా అధికారి స్థాయి నుండి అధ్యాపకులుగా పదోన్నతి పొందిన వారికి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద పీట వేస్తున్నారు. ఇన్నేళ్లు సేవ చేసిన సీనియర్ ప్రధానాచార్యులు, ఆచార్యులకు కనీస గౌరవం లేకుండా పోయింది. ఆచార్య పదోన్నతి కూడా హైదరాబాద్ చుట్టూనే ఇచ్చారు తప్ప రాష్ట్రంలోని మారుమూల జిల్లాలకు ఒక్కరిని కూడా పంపలేదు.

5. ప్రతినియుక్తి పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పక్షపాతం - బడిలో ఉండరు కార్యాలయంలో తిష్ట:
రాష్ట్రంలో అనేక కళాశాలల్లో బోధన సిబ్బంది తీవ్ర కొరత ఉన్నా, అక్కడకు పంపకుండా రాజకీయ పలుకుబడితో ప్రధాన కార్యాలయానికి లాగుతున్నారు. చాలా కళాశాలల ప్రధానాచార్యులు నెలలో 24 రోజులు కూడా కళాశాలలో ఉండటం లేదని, ఎప్పుడూ ఉప సంచాలకుల కార్యాలయంలోనే తిష్ట వేస్తూ, అడపాదడపా మాత్రమే కళాశాలకు వస్తున్నారని రాష్ట్ర వ్యాప్తంగా ఆరోపణలు ఉన్నాయి.

6. గుమాస్తా పనులకు గెజిటెడ్ హోదా వారా:
సీనియర్లు ఎందరో ఉన్నా వారిని కాదని గుమాస్తా చేయవలసిన పనులను గెజిటెడ్ హోదా ఉన్న వీరితో చేయించడం ఏమిటని ప్రధానాచార్యులు నిలదీస్తున్నారు. అంతగా పని ఉంటే బయటి సేవా సిబ్బందిని తీసుకోవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు.

7. నచ్చిన వారికే తాత్కాలిక బాధ్యతలు - నచ్చని వారికి నిబంధనలు:
రాష్ట్రంలోని అనేక చోట్ల తాత్కాలిక ప్రధానాచార్యులుగా ఉప సంచాలకులకు నచ్చిన వారే కొనసాగుతున్నారు. నచ్చిన వారికి నిబంధనలు సడలింపు, నచ్చని వారికి నిబంధనల పేరుతో విన్నపాలు తిరస్కరణ జరుగుతోందని, ఉన్నత వర్గాల వారికే అందలం దక్కుతోందని రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నర్సింగ్ విద్య పటిష్టానికి కృషి చేస్తున్నాం
ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు స్పందిస్తూ సక్రమ బోధన అందేటట్లు కృషి చేస్తున్నామని, ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామని చెప్పడం మొక్కుబడి వివరణగా మారింది.
క్షేత్ర పర్యటనలో పెంచి అన్ని నర్సింగ్ కళాశాలలో నాణ్యమైన బోధన అందించడం కోసం కృషి చేస్తున్నామని డిప్యూటీ డైరెక్టర్ నర్సింగ్ విద్యుల్లత జోర్దార్ ప్రతినిధికి వివరణ ఇచ్చారు.
కానీ చాలా కాలంలో అసౌకర్యాలు అక్రమాలు జరుగుతున్నాయని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

డ్రగ్స్ కట్టడికి డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల సోదాలు

(వీణవంక జోర్దార్ ప్రతినిధి):వీణవంక మండలంలో మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు అడ్డు కట్ట వేసేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. మండల కేంద్రంతో పాటు ఘన్ముకుల గ్రామంలో డాగ్ స్క్వాడ్ సహకారంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కొన్ని దుకాణాల్లో మాదకద్రవ్యాలు, గంజాయి ఉన్నాయనే సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగి సోదాలు నిర్వహించారు.
మండల కేంద్రంలోని పలు దుకాణాలతో పాటు ఘన్ముకుల గ్రామంలో అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మాదకద్రవ్యాల నిల్వ, విక్రయాలు, అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టారు. అయితే, పోలీసుల సోదాల్లో ఎలాంటి మాదకద్రవ్యాలు లభించకపోవడంతో తనిఖీలు ప్రశాంతంగా ముగిశాయి.



అనుమానం వస్తే సమాచారం ఇవ్వండి

మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు యువతను వాటికి దూరంగా ఉంచేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా ఇతర అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచిస్తున్నారు.

చెల్పూర్ ఉన్నత పాఠశాలలో

బేటి పడావో, బేటి బచావో, అవగాహన కార్యక్రమం

■ హుజురాబాద్ మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్.

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ మండల చెల్పూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం బేటీ పడావో, బేటీ బచావో, అవగాహన కార్యక్రమం ఇరుగంటి శైలజ జండర్ స్పెషలిస్ట్,మహిళా సాధికారత కేంద్రం, మహిళలు, పిల్లలు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ ల విభాగం డిపార్ట్మెంట్ మాడుగుల రమేష్ బాలల హక్కుల పరిరక్షణ విభాగము సోషల్ వర్కర్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ తెలిపారు.
ఈ సందర్భంగా ఇరుగంటి శైలజ మాట్లాడుతూ, బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, గురించి ప్రత్యేక అవగాహన కల్పించారనీ, మొబైల్ వినియోగం



దానిద్వారా కలిగే ఇబ్బందులు, జిల్లాలో యదార్థంగా జరిగిన సంఘటనలు వివరించి ఇబ్బందులు ఎదురైనప్పుడు ఎలా ఫిర్యాదు చేయాలో వివరంగా తెలిపారు. విద్యార్థులు ధైర్యంగా ఉన్నప్పుడే ఎలాంటి సమస్యలు రావని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు.
మాడుగుల రమేష్ మాట్లాడుతూ, బాలురు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వారి వయసు కన్నా పెద్దవారితో స్నేహం చేస్తే కలిగే ఇబ్బందులను నష్టాలను వివరించి అత్యవసర సమయంలో 1098కు డయల్ చేయాలని తెలిపారు. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు ముఖ్యంగా సత్ప్రవర్తన కలిగి ఉన్నట్లయితే ఎలాంటి ఇబ్బందులకు గురికారని, విద్యార్థి దశలో కేవలం చదువు పైన దృష్టి సారించాలని, అనవసర విషయాల్లో జోక్యం చేసుకోకూడదని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇనగంటి అనురాధ,ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు కె.రమాదేవి ఉభయ పాఠశాలల ఉపాధ్యాయులు, సిఆర్పిలు రమేష్, సుధామన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిపై ఫిర్యాదు

■ విచారణలో తప్పు చేసినట్లు తేలినా చర్యలు తీసుకోవడంలో జాప్యమెందుకు?

■ వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలి.. లేదంటే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన: అమరగాని ప్రదీప్ కుమార్

పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:మండలంలోని వడకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గుడిపాటి (ఊకంటి) వీణావాణిపై వచ్చిన ఆరోపణలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన అమరగాని ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు.రెండేళ్ల క్రితం విద్యా శాఖ అధికారులను మోసం చేసినట్లు ఆరోపిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ప్రదీప్ కుమార్ తెలిపారు. ఈ ఫిర్యాదుపై మండల విద్యాధికారి నిర్వహించిన విచారణలో వీణావాణి తప్పు చేసినట్లు, మోసానికి పాల్పడినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోవడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు.ప్రభుత్వ ధనాన్ని అక్రమంగా పొందేందుకు ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలు సృష్టించి, వాటి ద్వారా ప్రజాధనాన్ని పొందినట్లు ఆరోపించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను మోసం చేసినట్లు విచారణలో నిర్ధారణ అయినందున చీటింగ్, ఫోర్జరీకి సంబంధించి క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలి

సంబంధిత అధికారులు వారం రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని ప్రదీప్ కుమార్ కోరారు. లేని పక్షంలో తదుపరి ప్రజావాణి రోజున ఎంపీడీవో కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉన్నత పాఠశాలలో డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో

న్యాయ విజ్ఞాన సదస్సు

ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిధి:ఈ రోజు ఆదిలాబాద్ జిల్లా మావల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును డిఎల్ఎస్ఏ సెక్రటరీ హుస్సేన్ గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా న్యాయ సేవా సంస్థ అధికారి గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్య నేర్చుకోవాలి విద్యతోపాటు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మంచి హారాన్ని తీసుకోవాలి మరియు పోక్సో చట్టం, బాలల చట్టం గురించి పాఠశాల విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతులు సదుపాయాల గురించి పాఠశాల విద్యార్థులతో, సిబ్బందితో అడిగి తెలుసు



కున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అర్గుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ రావు డోలే,డిఎల్ ఎస్ఏ సిబ్బంది,పాఠశాల సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు వేదికలో

కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ పట్టణంలో శివారులోని కేసి క్యాంపులో గల రైతు వేదిక రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్, వ్యవసాయ శాఖ, జమ్మికుంట కెవికె ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నేలల రక్షణ పై రైతులు తీసుకోవాల్సిన చర్యలు, పంటల మార్పిడి తదితర అంశాలపై అధికారులు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొశీటాల సుహాసిని, కౌన్సిలర్లు సమ్మయ్య, సునీత, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సునీత, కెవికె శాస్త్రవేత్త ప్రశాంతి, సెరికల్చర్ ఏడి వెంకన్న, మండల వ్యవసాయ అధికారి చందా భూమిరెడ్డి, ఏఈఓ నిఖిల్, గోస్కుల వివేక్, రైతులు పాల్గొన్నారు.



అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఎంఎల్‌టీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఏడాది క్లినికల్ ట్రైనింగ్ (అప్రెంటిస్‌షిప్) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి ఎం. హృదయరాజు తెలిపారు. గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శిక్షణ పొందేందుకు రూ. 1,500, అలంపూర్ ఎక్స్ రోడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో శిక్షణకు రూ. 1,000 డీడీ చెల్లించాలని సూచించారు.అర్హులైన విద్యార్థులు దరఖాస్తు ఫారంతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియట్ మార్కుల మెమోలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, డీడీ తదితర అవసరమైన పత్రాలను తమ కళాశాలల్లో నవంబర్ 10వ తేదీలోగా సమర్పించాలని ఆయన కోరారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఈపీఎఫ్ ప్రయోజనాలపై

ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:ప్రైవేటు ఉద్యోగులు ఈపీఎఫ్ వల్ల కలిగే ప్రయోజనాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కరీంనగర్ పీఎఫ్ కార్యాలయ సూపరింటెండెంట్ మాజేటి రమేష్ సూచించారు. మంగళవారం హుజూరాబాద్‌లోని ఆదర్శ విద్యాలయంలో ఉద్యోగులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... ఈపీఎఫ్ సభ్యులు సర్వీసులో మరణిస్తే రూ. 2.50 లక్షల నుంచి రూ. 7 లక్షల వరకు బీమా అందుతుందని, పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు పెన్షన్‌కు అర్హులని తెలిపారు. అలాగే 50 ఏళ్లు నిండిన వారు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీఎం వీబీఆర్‌వై పథకం ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లోని కొత్త ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని, విధిగా ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో



నామినేషన్ నమోదు చేసుకోవాలని సూచించారు. సందేహాలుంటే కరీంనగర్ పీఎఫ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పిఎఫ్ సీనియర్ అసిస్టెంట్ గూడూరు అనిల్, పాఠశాల కరస్పాండెంట్ పి. కిరణ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన చెరకు పంట దగ్ధం..

రైతులకు భారీ నష్టం

జోగులాంబ గద్వాల జిల్లా,(జోర్దార్):జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం బుడుమర్స్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రాంప్రసాద్, యుగంధర్ అనే ఇద్దరు రైతులకు చెందిన తొమ్మిది ఎకరాల చెరకు పంట పూర్తిగా కాలిపోయింది. చేతికొచ్చిన పంట కళ్లముందే మంటలకు ఆహుతి కావడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. పంటతో పాటు సాగు కోసం ఏర్పాటు చేసిన డ్రిప్ పైపులు కూడా పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రైతులకు భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.



హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రిలో పడకేసిన వైద్యం

సిపిఐ సీనియర్ నేత మర్రి వెంకటస్వామి మండిపాటు



హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్‌లోని 100 పడకల ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు కనీస వైద్యం, సౌకర్యాలు అందడం లేదని సీపీఐ సీనియర్ నేత, ప్రముఖ సీనియర్ న్యాయవాది మర్రి వెంకటస్వామి మండిపడ్డారు. మంగళవారం ఆయన ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడుతూ... 37 మంది వైద్యులు ఉండాల్సిన చోట కేవలం ఏడుగురే విధులకు హాజరవుతున్నారని, గైనకాలజీ విభాగంలో స్పెషలిస్టులు లేకుండానే ఇతర వైద్యులతో ఓపీ నడిపిస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. కొందరు వైద్యులు కమీషన్లకు కక్కుర్తి పడి వైద్య పరీక్షల పేరిట రోగులను ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లకు మళ్లిస్తున్నారని విమర్శించారు. దవాఖానలో కనీస తాగునీటి సదుపాయం లేకపోవడంతో పాటు మధ్యాహ్న భోజనంలోనూ నాణ్యత లోపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్, ఇతర సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని వెంటనే దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేసి, పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

రైతుల భూ సమస్యల పరిష్కారానికి

రీ సర్వేపై అవగాహన అవసరం



■ భూ హక్కుల పరిరక్షణకు రీ సర్వే ప్రక్రియలో రైతుల భాగస్వామ్యం కీలకం

■ అమ్మనగుర్తి గ్రామ సర్పంచ్ కదిరె రమేష్

సైదాపూర్,జోర్దార్ ప్రతినిధి:జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని అమ్మనగుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ కదిరె రమేష్ అధ్యక్షతన భూభారతి రీ సర్వేపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, భూమి ప్రతి రైతుకు ఎంతో విలువైన ఆస్తి అని, భూమికి సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండటం భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.
భూభారతి రీ సర్వే ప్రక్రియపై రైతులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, తమ భూములకు సంబంధించిన వివరాలు, రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియలో రైతులకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలిపారు. అధికారులు అందిస్తున్న సూచనలు, సలహాలను పాటిస్తూ రీ సర్వే ప్రక్రియలో రైతులందరూ చురుకుగా భాగస్వాములు కావాలని కోరారు. భూములకు సంబంధించిన విషయాల్లో నిర్లక్ష్యం చేయకుండా, తమ హక్కులకు సంబంధించిన రికార్డులపై స్పష్టత పొందేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ సమావేశంలో కరీంనగర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ. కిషన్ రావు, డీఐ గాజుల రత్నం, పి. లక్ష్మణ్ నాయబ్ తహశీల్దార్, మండల గిర్దావర్ ఎం. రవి, సర్వేయర్ మనోజ్, గ్రామ ఉపసర్పంచ్ లంక దాసరి కార్తీక్, జీపీఓ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అధికారులు రైతులకు భూభారతి రీ సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించి, భూ రికార్డులకు సంబంధించిన అంశాలను వివరించారు.

జమ్మికుంట కూరగాయల మార్కెట్‌లో

సందడి చేసిన వొడితల ప్రణవ్

హుజూరాబాద్,జోర్దార్ ప్రతినిధి:జమ్మికుంట కూరగాయల మార్కెట్ లో సందడి చేశారు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించారు.కూరగాయలు అమ్మే సమయంలో పలు సమస్యలు యెదురవుతున్నాయని వాటిని పరిష్కరించాలని కోరగా తప్పకుండా పరిష్కరిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నాగేపల్లిలో బాధిత కుటుంబాలకు

మంత్రి శ్రీధర్ బాబు పరామర్శ



రామగిరి జోర్దార్ ప్రతినిధి:మండలంలోని నాగేపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాటి శ్రీనివాస్, అనారోగ్యంతో మృతి చెందిన దూడం వెంకటస్వామి చిత్రపటాలకు మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.
ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే పాలన

సమస్యల పరిష్కారమే లక్ష్యం



■ తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి.

వికారాబాద్,జోర్దార్ ప్రతినిధి:తాండూరు పురపాలక సంఘ అధ్వర్యంలో పట్టణంలోని 19, 20 ,21, 22 ,23, 24, వార్డుల్లో నిర్వహించిన"స్వచ్ తాండూర్ స్పెషల్ డ్రైవ్"కార్యక్రమంలో పాల్గొని, క్షేత్రస్థాయిలో చేపడుతున్న పారిశుద్ధ పనులను పరిశీలించిన తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ గొల్ల చెరువు పరిశీలించి, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయా వార్డుల్లో పర్యటించి మురుగు కాలువల శుభ్రత, దోమల నివారణ చర్యలు తదితర అంశాలను దగ్గరుండి పరిశీలించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ పనులను వేగవంతంగా చేపట్టాలని, మురుగు కాలువల శుభ్రత తో పాటు, రోడ్లు, వీధులు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే స్థానిక ప్రజలను నేరుగా కలిసి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు స్వచ్ఛమైన తాండూరు నిర్మాణంలో మునిసిపాలిటీకి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి, కమిషనర్ రాకేష్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ప్రాణాలను నిలబెట్టే

రక్తదానమే మహాదానం

■ ఏసిపి వాసంశెట్టి మాధవి.

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:అన్ని దానాల్లో కన్నా మనిషి ప్రాణాలను నిలబెట్టే రక్త దానం గొప్పదని హుజురాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని వివేల్ఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ రోశీటాల సుహాసిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసిపి వాసంశెట్టి. మాధవి మాట్లాడుతూ.. దేశ రక్షణ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ కుటుంబాలను సైతం వదిలి, కంటి మీద కునుకు లేకుండా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. చైర్ పర్సన్ సుహాసిని మాట్లాడుతూ... సమాజంలో ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్నారంటే దానికి పోలీసుల అహర్నిశల శ్రమే కారణమని, ఆపదలో ఉన్న ప్రాణాన్ని నిలబెట్టే రక్తదానం చేయడం ద్వారా అమరవీరుల



స్మృతికి సార్థకత చేకూరుతుందని ప్రశంసించారు. యువత పెద్ద సంఖ్యలో ముందుకొచ్చి ఈ శిబిరంలో 83 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు టి. కరుణాకర్, వీరబత్తిని శ్రీనివాస్, ఎస్. రామకృష్ణ, పులి వెంకట్, ఎస్ఐలు కొత్తపల్లి రవి, కృష్ణారావు, కే. శేఖర్ రెడ్డి, తిరుపతి, క్రాంతి, స్వాతి, వైద్య బృందం సభ్యులు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, సుజాత, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మార్నింగ్ వాకర్స్ ఫ్రెండ్స్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ లో ఆకస్మికంగా స్కానింగ్ సెంటర్లను

తనిఖీ చేసిన డా.సనాజివేరియా

హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:హుజురాబాద్ పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను జిల్లా మాతా శిశు సంరక్షణ ప్రత్యేక అధికారి డాక్టర్ సమాజ్వేరియా, హుజురాబాద్ డిప్యూటీ డిఎంహెచ్ ఓ డాక్టర్ ప్రభుదాస్ తో కలిసి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, తగిన సూచనలు చేశారు.ప్రతి స్కానింగ్ కు సంబంధించిన రిఫరల్ స్లిప్పులను ఫైల్ చేయాలని, ఫామ్ ఎఫ్ లను మైంటైన్ చేసి ప్రతి నెల ఆడిట్ చేపించాలని ఆదేశించారు.
జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు పి సి పి ఎన్ డి టి చట్టాన్ని



అమలు పరచాలని, గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ చేసి ఆడ, మగ చెప్పరాదని, చెబితే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగుల

ఆందోళనకు సిద్ధం - ప్రభుత్వానికి 15 రోజుల గడువు

■ 12 ప్రధాన డిమాండ్లతో ఆదర్శ పాఠశాలల ఐక్య కార్యాచరణ సంఘం వినతి పత్రం - పరిష్కారం లేకుంటే దశలవారీ నిరసనలు

జోర్దార్ ప్రతినిధి హైదరాబాద్:తెలంగాణ రాష్ట్రంలోని 194 ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులు గత అనేక సంవత్సరాలుగా పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. సర్వీసు, ఆర్థిక మరియు సంక్షేమానికి సంబంధించిన సమస్యలపై అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ, అనేక ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకుండా పెండింగ్ లో ఉన్నాయి.
ఈ నేపథ్యంలో ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సంఘం తెలంగాణ మోడల్ స్కూల్స్ సొసైటీ అదనపు సంచాలకులు మరియు పాఠశాల విద్యా సంచాలకులు గారికి వినతి పత్రం మరియు హెచ్చరిక ను సమర్పించింది.ఆదర్శ పాఠశాల వ్యవస్థ రాష్ట్ర విద్యారంగంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు మరియు ఉద్యోగుల సమస్యలను మానవతా దృక్పథంతో, న్యాయబద్ధంగా పరిష్కరించాలని కోరారు.

సంఘం ప్రధాన డిమాండ్లు 12 ఇవీ:

1. పాఠశాల విద్యా శాఖలో విలీనం చేయాలి:
ఆదర్శ పాఠశాలలను వెంటనే పాఠశాల విద్యా శాఖలో విలీనం చేసి, ఉద్యోగులందరికీ 010 ఖాతా ద్వారా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

2. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు మరియు ముగింపు ప్రయోజనాలు:
మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు వెంటనే కారుణ్య నియామకాలు కల్పించాలి. అర్హులైన కుటుంబాలకు మృతి పరిహారం, కుటుంబ పింఛను మరియు ఇతర అన్ని ముగింపు ప్రయోజనాలను ఎలాంటి ఆలస్యం లేకుండా మంజూరు చేసి విడుదల చేయాలి.

3. శిక్షణ పొందిన పట్టభద్ర ఉపాధ్యాయులకు జూన్ 2013 నుండి కల్పిత సేవ:
పోస్టు గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు మరియు ప్రధానాచార్యులకు కల్పించిన విధంగా, అర్హులైన శిక్షణ పొందిన పట్టభద్ర ఉపాధ్యాయుల సేవను జూన్ 2013 నుండి పరిగణనలోకి తీసుకొని కల్పిత సేవా ప్రయోజనాలు కల్పించాలి. తద్వారా వారి సీనియారిటీ, పదోన్నతులు మరియు ఇతర సేవా ప్రయోజనాల విషయంలో న్యాయం చేయాలి.

4. కరవు భత్యం బకాయిలు మరియు అంశదాయ పింఛను జత నిధి:
ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న కరవు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేసి చెల్లించాలి. అదేవిధంగా ఉద్యోగుల తరపున ప్రభుత్వం చెల్లించాల్సిన అంశదాయ పింఛను జత నిధి బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

5. ఉద్యోగుల ఆరోగ్య పథకం సౌకర్యం కల్పించాలి:
అర్హులైన ఆదర్శ పాఠశాలల ఉద్యోగులందరికీ ఉద్యోగుల ఆరోగ్య పథకం సౌకర్యాన్ని వెంటనే వర్తింపజేయాలి.

6. 317 మార్గదర్శకాలను అమలు చేసి పదోన్నతులు కల్పించాలి:
317 మార్గదర్శకాలను ఆదర్శ పాఠశాల ఉద్యోగులకు సక్రమంగా అమలు చేసి, అర్హులైన ఉపాధ్యాయులకు మరియు ప్రధానాచార్యులకు వారి సీనియారిటీ, అర్హతలకు అనుగుణంగా పదోన్నతి అవకాశాలు కల్పించి, పెండింగ్ పదోన్నతులను వెంటనే పూర్తి చేయాలి.

7. జూనియర్ అధ్యాపక పోస్టులను ఏర్పాటు చేయాలి:
ఆదర్శ పాఠశాలల్లో అవసరమైన జూనియర్ అధ్యాపక పోస్టులను సృష్టించి, అర్హత మరియు సీనియారిటీ కలిగిన పోస్టు గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులకు జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలి.

8. హిందీ పోస్టు గ్రాడ్యుయేట్ పోస్టులను మంజూరు చేయాలి:
ఆదర్శ పాఠశాలల్లో అవసరమైన హిందీ పోస్టు గ్రాడ్యుయేట్ పోస్టులను సృష్టించి, అర్హత కలిగిన హిందీ శిక్షణ పొందిన పట్టభద్ర ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి.

9. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, ప్రతి పాఠశాలకు జూనియర్ సహాయక పోస్టు మంజూరు చేయాలి:
ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ మరియు ఇతర ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. అదేవిధంగా, ప్రతి పాఠశాలలో పెరుగుతున్న పరిపాలన అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఒక క్రమబద్ధ జూనియర్ సహాయక పోస్టును మంజూరు చేసి, నియామకం చేపట్టాలి.

10. విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయుల అదనపు పనిభారాన్ని పరిష్కరించాలి:
ఆదర్శ పాఠశాలల్లో విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులపై ఉన్న అదనపు పని భారాన్ని సమీక్షించి, విషయాల వారీగా అవసరమైన పోస్టులను మంజూరు చేయడం లేదా తగిన సిబ్బందిని నియమించడం ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలి.

11. బాహ్య సేవా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి:
ఆదర్శ పాఠశాలల్లో అనేక సంవత్సరాలుగా నిరంతరంగా సేవలందిస్తున్న బాహ్య సేవా ఉద్యోగుల సేవలను పరిగణనలోకి తీసుకొని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా వారిని క్రమబద్ధీకరించడానికి తగిన చర్యలు తీసుకోవాలి.

12. గంటల ప్రాతిపదిక ఉపాధ్యాయులకు కనీస వేతనం 35 వేలు చెల్లించాలి:
ఆదర్శ పాఠశాలల్లో గంటల ప్రాతిపదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులు నిరంతరం విద్యా సేవలు అందిస్తున్నారు. వారి సేవలను పరిగణనలోకి తీసుకొని, వారికి నెలకు కనీసం 35 వేల రూపాయల వేతనం చెల్లించే విధంగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలి.

15 రోజుల గడువు - దశలవారీ నిరసన కార్యక్రమాలకు హెచ్చరిక:
పై 12 ప్రధాన సమస్యలు ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలుగా ఉన్నందున, వీటిని ఇకపై కూడా నిరవధికంగా పెండింగ్ లో ఉంచడం సాధ్యం కాదు.కావున, ఈ వినతి పత్రం అందిన తేదీ నుండి 15 రోజుల్లోగా పై సమస్యలపై స్పష్టమైన నిర్ణయం తీసుకొని, పరిష్కారానికి సంబంధించిన ఉత్తర్వులు ప్రారంభించి, సంఘం ప్రతినిధులతో అధికారికంగా చర్చలు నిర్వహించాలని కోరుతున్నారు.
15 రోజుల్లోగా పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోని పక్షంలో, ఎటువంటి అదనపు హెచ్చరిక లేకుండా ప్రజాస్వామ్య, శాంతియుత మరియు చట్టబద్ధమైన పద్ధతిలో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టవలసి వస్తుందని ఈ హెచ్చరిక ద్వారా తెలియజేస్తున్నారు.

దశలవారీ నిరసన కార్యక్రమాలు:
దశ-1: అన్ని ఆదర్శ పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీ ధరించి నిరసన.
దశ-2: జిల్లా స్థాయిలో నిరసన కార్యక్రమాలు మరియు అధికారులకు వినతి పత్రాల సమర్పణ.
దశ-3: జిల్లా విద్యాధికారి / జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ధర్నాలు.
దశ-4: రాష్ట్ర స్థాయిలో పాఠశాల విద్యా సంచాలకుల కార్యాలయం ఎదుట మహాధర్నా / నిరసన.
దశ-5: సమస్యలు పరిష్కారం కాని పక్షంలో రాష్ట్రస్థాయి ఉద్యమ కార్యాచరణను ప్రకటించి, మరింత తీవ్రతరమైన నిరసన కార్యక్రమాలు.
ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఈ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, 15 రోజుల్లోగా పరిష్కరించి న్యాయం చేస్తుందని ఆశిస్తున్నాము.

హైదరాబాద్ నడిబొడ్డున

200 కోట్ల భూ కుంభకోణంలో అధికారుల హస్తం

■ మూడు రేకుల షెడ్లలో సనత్ నగర్ పారిశ్రామిక శిక్షణ సంస్థ -
■ ఒక్క మల్లేపల్లి ఆవరణలోనే నాలుగు సంస్థలు ఎందుకు? -
■ మూడేళ్లయినా తేలని విచారణ నివేదిక

జోర్దార్ ప్రతినిధి హైదరాబాద్:హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న సనత్ నగర్ లో సుమారు 200 కోట్ల విలువైన రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం మాయం కావడం రాష్ట్ర చరిత్రలోనే పెద్ద కలకలం రేపుతోంది. కొందరు ఉద్యోగులు, అధికారులు కుమ్మక్కై ఆ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయడం, ప్రభుత్వ సంస్థను మూడు రేకుల షెడ్లలోకి తరలించడం ఇప్పుడు తీవ్ర వివాదంగా మారింది.

అసలు కథ ఏమిటి:
25 ఏళ్ల క్రితం సనత్ నగర్ లోని ఆల్విన్ పరిశ్రమలో పని చేసే కార్మికుల పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం కోసం ఒక పారిశ్రామిక శిక్షణ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పట్లో ఆ పరిశ్రమ యాజమాన్యం రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి ఇచ్చింది.
కానీ కొందరు అధికారులు ప్రభుత్వానికి తెలియకుండా ఆ రెండు ఎకరాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేశారు. అక్కడ నడుస్తున్న ప్రభుత్వ శిక్షణ సంస్థను మల్లేపల్లి ఆవరణకు మార్చి, అక్కడ మూడు రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు.

ఒక్క ఆవరణలో నాలుగు సంస్థలు ఎందుకు:

ప్రస్తుతం ఒక్క మల్లేపల్లి ఆవరణలోనే నాలుగు పారిశ్రామిక శిక్షణ సంస్థలు నడుస్తున్నాయి. సొంత స్థలం, భవనం ఉన్న సనత్ నగర్ సంస్థను అక్కడి నుండి తరలించి, ఇరుకు షెడ్లలో ఎందుకు నడుపుతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది ఆ భూమిని కబ్జా చేసేందుకు వేసిన పథకమేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

200 కోట్ల కుంభకోణం - మూడేళ్లుగా తేలని విచారణ:
విషయం బయటకు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించి, ఒక ప్రత్యేక బృందాన్ని నియమించారు. కానీ ఆ బృందం ఏర్పాటు చేసి మూడేళ్లు గడిచినా ఇప్పటి వరకు విచారణ నివేదిక బయటకు రాలేదు. తెలంగాణ పారిశ్రామిక శిక్షణ సంస్థ ఉన్నతాధికారుల అవినీతి, అక్రమాలపై దర్యాప్తు నత్తనడకన సాగుతోందని విమర్శలు వస్తున్నాయి.
హైదరాబాద్ నడిబొడ్డున 200 కోట్ల ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేటు వ్యక్తుల పేరిట మార్చిడి చేయడం రాష్ట్ర చరిత్రలోనే సంచలనం సృష్టించింది. ఈ తతంగం వెనుక హైదరాబాద్ లోని బలమైన వర్గం హస్తం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

ముఖ్యమంత్రికి ఫిర్యాదు - డిమాండ్లు:
ఈ వ్యవహారంపై సామాజికవేత్త రాధాకృష్ణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు లేఖ పంపారు. ఆయన డిమాండ్లు:

1. ప్రభుత్వానికి తెలియకుండా రెండు ఎకరాల స్థలాన్ని అమ్మిన అధికారులు, ఉద్యోగులు ఎవరో గుర్తించి వెంటనే విధుల నుండి తొలగించాలి.
2. ప్రైవేటు వ్యక్తుల పేరిట జరిగిన అక్రమ మార్పిడిని రద్దు చేసి, ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి.
3. మూడేళ్లుగా పెండింగ్ లో ఉన్న విచారణ నివేదికను వెంటనే బయటపెట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
4. మల్లేపల్లిలోని మూడు రేకుల షెడ్లలో కాకుండా, సనత్ నగర్ లోని సొంత స్థలంలోనే శిక్షణ సంస్థను పునరుద్ధరించాలి.

ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వాలీబాల్‌లో కరీంనగర్ జట్టు సత్తా!





■ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం.. రాష్ట్రస్థాయి పోటీలకు చల్లూరు విద్యార్థులు
■ మల్లారెడ్డిపల్లి విద్యార్థులు మణిదీప్, అరవింద్ సాయికి అవకాశం

(కరీంనగర్,జోర్దార్ ప్రతినిధి)క్రీడా రంగంలో కరీంనగర్ జిల్లా జట్టు మరోసారి తన ప్రతిభను చాటుకుంది. 70వ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-14 వాలీబాల్ పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అక్టోబర్ 25న కేశవపట్నం గ్రామంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచింది.

రాష్ట్రస్థాయి పోటీలకు ఇద్దరు విద్యార్థులు
ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా చల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూదరి మణిదీప్, గోనెల అరవింద్ సాయి తమ క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

విద్యార్థులకు అభినందనల వెల్లువ
విద్యార్థుల విజయంపై చల్లూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సంపత్ కుమార్ చారి, వ్యాయామ ఉపాధ్యాయురాలు రజిని, చల్లూరు గ్రామ సర్పంచ్ రామిడి సంపత్ రెడ్డి, ఉపసర్పంచ్ ఎండీ ఫసియొద్దీన్, మల్లారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ కొలిపాక రజిత శ్రీనివాస్, ఉపసర్పంచ్ అర్సం శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారుడు కర్రె నాని, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.
రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే ఉత్సాహంతో ఆడి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభ పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.

విద్యార్థి దశ నుండే చట్టాల పై అవగాహన కలిగి ఉండాలి



■ క్రమశిక్షణ కలిగిన బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి.
■ బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు.

బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, క్రమశిక్షణగా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ కే శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో, పోలీసు వారోత్సవాల సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, దేశం కోసం, ప్రజల రక్షణ కోసం, పోలీసులు ప్రాణాలను అర్పిస్తున్నారని, వారిని స్మరించు కోవడం బాధ్యతగా గుర్తుంచుకోవాలని, విద్యార్థులు చిన్ననాటి నుండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని, మత్తు పదార్థాలకు, మాధక ద్రవ్యాలకు, అలవాటు కావద్దని పిలుపునిచ్చారు.
అనంతరం పోలీస్ స్టేషన్ లో జరిగే పని విధానాన్ని రిసెప్షన్, మహిళా డెస్క్, కేసుల నమోదు వివరాలు, లాకప్ గదులు, శాంతి భద్రతల విషయాలపై వినియోగించే ఆయుధాలు, సాధనాల విషయమై వివరించారు.
మహిళలు, బాలికల విషయమై ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ ను, పని విధానాన్ని, అత్యవసరంగా ఉపయోగించే ఫోన్ నెంబర్లను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై డి రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ తెలుగు దినపత్రిక
JORDAR TELUGU DAILY
అవినీత అంతం - మా పంతం
బుధవారం, అక్టోబర్ 28 2026

వైద్యం పేరుతో వసూళ్ల దందా? బిల్లులు చూస్తే బెంబేలెత్తాల్సిందే!

- చేయని సేవలకూ బిల్లులు?
- డిశ్చార్జి సమయంలోనే అసలు బాదుడు!
- అడిగితే డిస్కౌంట్.. అడగకపోతే ఫుల్ బిల్లు!
- ఇన్సూరెన్స్ రోగులకూ తప్పని అదనపు భారం!
- గది అద్దెలు, పరీక్షల పేరుతో భారీ వసూళ్లు!
- బిల్లింగ్‌పై అధికారుల పర్యవేక్షణ ఏదీ?



తెలంగాణ జోర్దార్ బ్యూరో

ఆస్పత్రికి వెళ్లేది ప్రాణాలు కాపాడుకోవడానికి.. కానీ చికిత్స పూర్తయ్యాక చేతికొచ్చే బిల్లు చూస్తే రోగి బంధువుల గుండెల్లో గుబులు పుడుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో బిల్లింగ్ విధానంపై రోగుల బంధువుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. చికిత్సకు సంబంధించిన ఖర్చులతో పాటు వివిధ రకాల చార్జీలు బిల్లుల్లో చేరుతున్నాయని, వాటిపై ప్రశ్నిస్తే డిస్కౌంట్ పేరుతో కొంత మొత్తాన్ని తగ్గిస్తున్నారని పలువురు వాపోతున్నారు.ఆస్పత్రిలో చేరిన సమయంలో చెప్పిన అంచనా ఖర్చుకు, డిశ్చార్జి సమయానికి చేతికొచ్చే తుది బిల్లుకు భారీ తేడా ఉంటోందని బాధితులు చెబుతున్నారు. మందులు, పరీక్షలు, వైద్యుల కన్సల్టేషన్, గది అద్దె వంటి సాధారణ ఖర్చులకు అదనంగా డైట్, హ్యాండ్లింగ్, ప్రాసెసింగ్ పేర్లతో చార్జీలు చేరుతున్నాయని ఆరోపిస్తున్నారు.

చిన్నారికి మూడు రోజుల చికిత్స.. భారీ బిల్లు

ఎల్‌బీనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఏడాదిన్నర వయసున్న చిన్నారిని న్యుమోనియా అనుమానంతో చేర్పించిన కుటుంబానికి మూడు రోజుల తర్వాత భారీ బిల్లు ఎదురైనట్లు సమాచారం. డైట్ చార్జీలతో పాటు మందులను ఒక అంతస్తు నుంచి మరో అంతస్తుకు తరలించినందుకు హ్యాండ్లింగ్ చార్జీలు, బీమా ప్రాసెసింగ్ ఫీజు వంటి మొత్తాలు బిల్లులో చేర్చినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. మొత్తం బిల్లు రూ.90 వేల వరకు చేరగా, చివరకు రూ.15 వేల డిస్కౌంట్ ఇచ్చినట్లు తెలిపారు.

పరీక్షల పేరుతో ఖర్చు పెంపు?

బంజారాహిల్స్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో బీపీ, షుగర్ సమస్యలతో చేరిన 56 ఏళ్ల మహిళకు మూడు రోజుల చికిత్స అనంతరం రూ.89 వేల బిల్లు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బయోకెమిస్ట్రీ, ల్యాబ్, ఇన్వెస్టిగేషన్స్ పేర్లతో పలు చార్జీలు విధించారని, చివరకు రూ.6 వేల డిస్కౌంట్ ఇచ్చారని పేర్కొన్నారు. అవసరమైనదానికంటే ఎక్కువ పరీక్షలు చేయించారనే అనుమానాన్ని కుటుంబ సభ్యులు వ్యక్తం చేశారు.

ఇన్సూరెన్స్ ఉన్నా అదనపు భారం?

కూకట్‌పల్లికి చెందిన ఓ మహిళ విషయంలోనూ బిల్లింగ్ వివాదం తలెత్తినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇన్సూరెన్స్ పాలసీకి రెండు పడకల గది వర్తిస్తుందని ముందుగా చెప్పినప్పటికీ, డిశ్చార్జి సమయంలో జనరల్ వార్డు మాత్రమే పాలసీలో ఉందని చెప్పి రూ.1.10 లక్షలు చెల్లించాలని కోరినట్లు ఆరోపించారు. కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రూ.15 వేల వరకు తగ్గించినట్లు తెలిపారు.

24 గంటలకే రెండు రోజుల గది అద్దె?

మలక్‌పేటలోని ఓ ఆస్పత్రిలో రోగి 24 గంటలు మాత్రమే ఉన్నప్పటికీ రెండు రోజుల గది అద్దె బిల్లులో చేర్చారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బిల్లు పరిశీలించిన సమయంలో విష యం బయటపడటంతో సిబ్బందిని ప్రశ్నించగా తప్పిదం జరిగి ందని అంగీకరించి రూ.4 వేల వరకు తగ్గించినట్లు తెలిపారు.

చిన్న చార్జీలే.. కానీ చివరికి భారీ బిల్లు

మరో ఘటనలో నెబ్యులైజర్ వినియోగానికి ఒక్కోసారి రూ.400 చొప్పున, రోజుకు మూడు సార్లు కలిపి రూ.1,200 బిల్లు వేశారని రోగి బంధువు ఆరోపించారు. దీనిపై ప్రశ్నించడంతో బిల్లింగ్‌పై చర్చ జరిగినట్లు తెలిపారు. ఇలాంటి చిన్న చిన్న చార్జీలు వరుసగా బిల్లులో చేరడంతో చివరకు మొత్తం భారీగా పెరుగుతోందని రోగుల బంధువులు అంటున్నారు.

డిశ్చార్జి సమయంలో బిల్లు తప్పనిసరిగా పరిశీలించాలి

రోగిని ఇంటికి తీసుకెళ్లే హడావుడిలో చాలామంది డిశ్చార్జి బిల్లు ను పూర్తిగా పరిశీలించలేకపోతున్నారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో చెల్లింపులు చేసి ఉండటంతో మిగిలిన మొత్తాన్ని చెల్లించడంపైనే దృష్టి పెడుతున్నారు. దీంతో బిల్లులోని ప్రతి అంశాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా పోతోందని బాధితులు చెబుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో బిల్లింగ్ విధానంపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని రోగుల బంధువులు కోరుతున్నారు. రోగికి అందించిన ప్రతి వైద్య సేవ, పరీక్ష, మందు, గది అద్దె, ఇతర చార్జీలను స్పష్టంగా బిల్లులో పేర్కొనేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



హ్యారీ కేన్‌కు బాలన్ డి ఓర్.. కోహ్లీ ప్రత్యేక అభినందనలు!

- ఎన్నో ఏళ్ల కష్టం, పట్టుదలకు తగిన గుర్తింపు..

మిత్రుడి విజయంపై విరాట్ హర్షం

క్రీడా విభాగం: ఫుట్‌బాల్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వ్యక్తిగత పురస్కారమైన బాలన్ డి ఓర్ అవార్డును గెలుచుకున్న ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. జర్మనీకి చెందిన బేయర్న్ మ్యూనిక్ క్లబ్ తరఫున అద్భుత ప్రదర్శన చేసిన కేన్ ఈ పురస్కారాన్ని అందుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా తన మిత్రుడికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపాడు. కేన్ సాధించిన విజయం వెనుక ఉన్న కష్టం, పట్టుదల, నిజాయతీని ప్రశంసిస్తూ సామాజిక మాధ్యమం వేదికగా సందేశాన్ని పంచుకున్నాడు.**నీ విజయానికి సువ్వు అర్హుడివి: కోహ్లీ** హ్యారీ కేన్‌ను తన ఆత్మీయ మిత్రుడిగా సంబోధించిన విరాట్ కోహ్లీ.. అతడు సాధించిన ఘనత పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. ఫుట్‌బాల్ క్రీడలో ఎన్నో ఏళ్లుగా కేన్ చూపిస్తున్న పట్టుదల, కఠోర శ్రమ, నిలకడైన ప్రదర్శనకు ఈ పురస్కారం తగిన గుర్తింపుగా అభివర్ణించాడు. ఉన్నత స్థాయిలో ఆడుతూ తన వ్యక్తిత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని కాపాడుకోవడం గొప్ప విషయమని ప్రశంసించాడు.కేన్ ఈ అవార్డును అందుకోవడానికి పూర్తిగా అర్హుడని పేర్కొన్న కోహ్లీ.. అతడి కుటుంబానికి కూడా శుభాకాంక్షలు తెలిపాడు. కేన్ సాధించిన విజయాన్ని చూసి కుటుంబ సభ్యులు గర్వపడతారని, అతడు కూడా తన ప్రయాణం పట్ల గర్వపడాలని ఆకాంక్షించాడు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ తన శుభాకాంక్షలను తెలియజేశాడు.

అభిషేక్ శర్మ విధ్వంసం.. న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం!

- మెరుపు శతకంతో చెలరేగిన యువ ఓపెనర్..

మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్ కైవసం



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ గడ్డపై భారత క్రికెట్ జట్టు విజయ పరంపరను కొనసాగిస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన మూడో మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసక శతకంతో చెలరేగగా, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కీలక ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో భాగస్వామి అయ్యాడు. వీరిద్దరి దూకుడుతో భారత్ ఆరు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి, మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను 30తో సొంతం చేసుకుంది. **అభిషేక్ శర్మ మెరుపు శతకం**భారత ఇన్నింగ్స్‌లో అభిషేక్ శర్మ ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ పరుగుల వరద పారించాడు. క్రీజులో కుదురుకున్న తర్వాత తనదైన దూకుడుతో బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అతడి అద్భుత బ్యాటింగ్‌తో భారత జట్టు లక్ష్య ఛేదన సులభతరమైంది. అభిషేక్ శర్మ 113 పరుగులు చేసి జట్టు విజయానికి బలమైన పునాది వేశాడు. **వైభవ్ సూర్యవంశీ కీలక ఇన్నింగ్స్**అభిషేక్ శర్మకు తోడుగా యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కూడా రాణించాడు. 45 పరుగులు చేసి జట్టు విజయానికి తన వంతు సహకారం అందించాడు. ఇద్దరి దూకుడుతో భారత బ్యాటింగ్ విభాగం ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించింది. కీలక సమయంలో పరుగులు సాధించడం ద్వారా భారత్ విజయ దిశగా ముందుకు సాగింది. **భారత్ ఖాతాలో మరో సిరీస్ విజయం**ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 30తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. సిరీస్ ప్రారంభం నుంచే నిలకడైన ఆటతీరును ప్రదర్శించిన టీమిండియా, మూడో మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. బ్యాటింగ్‌లో దూకుడు, కీలక సమయాల్లో ఆటగాళ్ల సమర్థత భారత విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవడం భారత జట్టు ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది. మిగిలిన మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించి సిరీస్‌ను పూర్తి స్థాయిలో ముగించాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకోనుంది.**అభిమానుల్లో హర్షాతిరేకాలు** అభిషేక్ శర్మ దూకుడైన బ్యాటింగ్, యువ ఆటగాళ్ల ప్రతిభ భారత క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అంతర్జాతీయ స్థాయిలో యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుతుండటం జట్టుకు శుభపరిణామంగా మారింది. సమష్టి కృషితో న్యూజిలాండ్‌పై ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు మరోసారి తన విజయపరంపరను కొనసాగించింది.

అర్ష్‌దీప్ సింగ్ అరుదైన ఘనత.. టీ20ల్లో 150 వికెట్లకు ఒక్క అడుగు దూరంలో!

న్యూజిలాండ్‌తో మూడో టీ20లో రికార్డు.. అంతర్జాతీయ టీ20ల్లో ఈ ఘనత సాధించనున్న తొలి భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం

వెల్లింగ్టన్: భారత క్రికెట్ జట్టు ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో మరో అరుదైన మైలురాయికి చేరువయ్యాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో కీలక వికెట్ సాధించి తన ఖాతాలో 149వ వికెట్‌ను వేసుకున్నాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో 150 వికెట్ల మైలురాయిని చేరుకోవడానికి ఒక్క వికెట్ దూరంలో నిలిచాడు. తదుపరి వికెట్ సాధిస్తే ఈ ఘనతను అందుకున్న తొలి భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించనున్నాడు. తన పదునైన బంతులు, స్వింగ్, కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టే సామర్థ్యంతో జట్టులో ప్రత్యేక గుర్తింపు పొందిన అర్ష్‌దీప్ మరోసారి వార్తల్లో నిలిచాడు.**టీమ్ సీఫెర్ట్‌ను ఔట్ చేసి 149వ వికెట్**వెల్లింగ్టన్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఈ క్రమంలో భారత బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ప్రత్యర్థి జట్టు ఓపెనర్ టిమ్ సీఫెర్ట్‌ను పెవిలియన్‌కు పంపించాడు. ఈ వికెట్‌తో అతడి అంతర్జాతీయ టీ20 వికెట్ల సంఖ్య 149కి చేరింది. తద్వారా పొట్టి క్రికెట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన పేసర్ల జాబితాలో తన స్థానాన్ని మరింత



మెరుగుపరుచుకున్నాడు.**భారత క్రికెట్‌లో కొత్త చరిత్రకు చేరువ**అంతర్జాతీయ టీ20ల్లో 150 వికెట్లు సాధించడం బౌలర్ స్థిరమైన ప్రదర్శనకు నిదర్శనం. ముఖ్యంగా బ్యాటర్లకు అనుకూలంగా ఉండే ఈ ఫార్మాట్‌లో పరుగుల వేగాన్ని నియంత్రిస్తూ వికెట్లు తీయడం అంత సులభం కాదు. అలాంటి పరిస్థితుల్లో అర్ష్‌దీప్ వరుసగా మెరుగైన ప్రదర్శనలు చేస్తూ ఈ స్థాయికి చేరుకోవడం విశేషం. మరో వికెట్ సాధిస్తే 150 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా తన పేరును రికార్డుల్లో లిఖించుకోనున్నాడు.**అత్యధిక వికెట్లు సాధించిన పేసర్లలో అర్ష్‌దీప్**అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన పేసర్ల జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన ముస్తాఫిజుర్ రెహ్మాన్ 163 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ స్టార్ బౌలర్ టిమ్ సౌథీ 160 వికెట్లతో తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ 149 వికెట్లతో మూడో స్థానానికి చేరుకోగా, బ్రహ్మైన్‌కు చెందిన రిజ్వాన్ బట్ 148 వికెట్లతో తర్వాతి స్థానంలో ఉన్నాడు. ఐర్లాండ్‌కు చెందిన మార్క్ అడైర్ 142 వికెట్లతో ఈ జాబితాలో కొనసాగుతున్నాడు.**కీలక బౌలర్‌గా ఎదిగిన అర్ష్‌దీప్** భారత జట్టులో ఎడమచేతి వాటం వేగవంతమైన బౌలర్‌గా అర్ష్‌దీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతో పాటు చివరి ఓవర్లలోనూ ఒత్తిడిని తట్టుకుని బౌలింగ్ చేయగలగడం అతడి ప్రత్యేకత. అంతర్జాతీయ టీ20ల్లో అతడి ప్రదర్శన జట్టు విజయాల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 150 వికెట్ల మైలురాయికి చేరువ కావడంతో అభిమానులు అతడి తదుపరి ప్రదర్శనపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మొత్తంగా అర్ష్‌దీప్ సింగ్ సాధించిన 149 వికెట్లు భారత టీ20 క్రికెట్‌కు గర్వకారణంగా నిలుస్తున్నాయి. మరో వికెట్‌తో అరుదైన ఘనతను అందుకునే అవకాశం ఉండటంతో ఈ మ్యాచ్ అతడి కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోనుంది. భారత క్రికెట్ చరిత్రలో మరో మైలురాయిని నమోదు చేసేందుకు అర్ష్‌దీప్ సిద్ధంగా ఉన్నాడు.

ధోనికి ఉన్న ఆ ప్రత్యేక లక్షణం నాకూ కావాలి!

- మైదానంలో ఆటను అర్థం చేసుకోవడమే ధోని విజయ రహస్యం: ఫాఫ్ డుప్లెసిస్



ఇంటర్నెట్ డెస్క్:భారత మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ ప్రశంసలు కురిపించాడు. మైదానంలో పరిస్థితులను అర్థం చేసుకుంటూ, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం ధోనిలోని ప్రత్యేక లక్షణమని పేర్కొన్నాడు. ఆ లక్షణాన్ని తాను కూడా తన నాయకత్వంలో అనుసరించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన డుప్లెసిస్.. ధోని మ్యాచ్‌కు ముందే ఎక్కువగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం కంటే, ఆట జరుగుతున్న సమయంలో పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకోవడానికి ప్రాధాన్యమిస్తాడని తెలిపాడు. ప్రత్యర్థి ఆటగాళ్లను, మైదానంలోని పరిస్థితులను నిశితంగా గమనిస్తూ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే ధోని ప్రత్యేకత అని వివరించాడు.ధోని ఆటను అర్థం చేసుకునే విధానం, అతడి సంయమనం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని డుప్లెసిస్ పేర్కొన్నాడు. ఈ లక్షణాలను తన నాయకత్వంలోనూ అనుసరించాలని ఉందని చెప్పాడు.ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ధోని నాయకత్వంలో తొమ్మిది సీజన్ల పాటు ఆడిన డుప్లెసిస్.. ఆ జట్టు సాధించిన మూడు ఐపీఎల్ టైటిళ్లలో భాగస్వామిగా నిలిచాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో 154 మ్యాచ్‌లు ఆడి 4,773 పరుగులు సాధించాడు. 2022లో రాయల్ ఛాలెంజర్స్

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



విరోష్ జంటకు ఓవైపు కొండంత ప్రేమ.. మరోవైపు సముద్రమంత పగ

వదినమ్మా అంటూ ఆప్యాయంగా పిలిచే అభిమానం ఒకవైపు.. ఇష్టమొచ్చిన రీతిలో ట్రోల్స్ చేస సూక మరోవైపు.. ఈ బరెండింటి మధ్య నేషనల్ క్రష్ రష్మిక జంట క్రష్ అవుతోందా..? అంటే అవుననే అంటోంది ఆ జంట..ఆజంటను విపరీతంగా అభిమానంచే విరోష్ టీమ్... అందుకే ఇష్యూ సైబర్ క్రైమ్ దాకా వెళ్లింది... ఇష్టారీతిన కామెంట్స్ చేసినవారిని శిక్షించాలని ఫిర్యాదు చేసేదాకా రచ్చ చేసింది. ప్రేమిస్తే ఇంత గాఢంగా ప్రేమిస్తారా? ద్వేషిస్తే మాత్రం ఎందుకింతగా వెంటపడతారు? విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట విషయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో జరుగుతున్నదిదే.

ఒక టాక్ షోలో ఇద్దరూ మనసు విప్పి మాట్లాడితే.. కొందరు అభినందించారు.. మరికొందరు ట్రోలింగ్‌కు దిగారు. ప్రేమ ఎలా మొదలైంది? పెళ్లి గురించి ఎవరు ఎవరికి ప్రపోజ్ చేశారు? రష్మిక హిందీ మాట్లాడిన విధానంపైనా వదల్లేదు ట్రోలర్స్. ఇలా ప్రతి విషయాన్నీ పట్టుకుని కామెంట్లతో తమ మూర్ఖత్వాన్ని చూపించారు. కానీ ఈసారి రష్మిక సైలెంట్‌గా ఉండలేదు. తనను ప్రేమించే వాళ్లకే కాదు.. తనను ట్రోల్ చేసేవాళ్లకూ స్వీట్‌గా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చేసారు. విజయ్‌ను పెళ్లి చేసుకోవాలనే నిర్ణయం వెయ్యిసార్లు చెప్పాల్సి వచ్చినా చెబుతానంటూ తన ప్రేమను ఓపెన్‌గా బయటపెట్టారు.ఒక ఇంటర్వ్యూ.. కొన్ని వ్యక్తిగత విషయాలు.. అంతే.. సోషల్ మీడియాలో ట్రోలర్స్‌కు పని దొరికింది. విజయ్ దేవరకొండ, రష్మిక జంటపై ఇష్టమొచ్చినట్లు కామెంట్లతో రెచ్చిపోయారు. విజయ్-రష్మిక ఇద్దరూ తమ జీవితానికి సంబంధించిన విషయాలను సరదాగా పంచుకుంటే.. వాటిని పట్టుకుని విమర్శలతో విరుచుకుపడ్డారు. దీనిపై రష్మిక అసహనం వ్యక్తం చేస్తూనే, తన ప్రేమ, పెళ్లి, ఎంత బలమైనవో చెప్పుకొచ్చారు. తనను ప్రేమించే వాళ్ల అభిమానం తనకు తెలుసని.. తనను ఇష్టపడని వాళ్ల అభిప్రాయాలూ తెలుసని చెప్పిన ఆమె, కొన్ని కామెంట్లు చదివితే ఆశ్చర్యం వేసిందని, అయినా ఇలాంటి ట్రోల్స్ తమ జంటను కుంగదీయవని చెప్పుకొచ్చారు. అంతేకాదు అప్పుడప్పుడు వాటిని చదివి నవ్వుకుంటానంటూ సెటైర్ వేశారు రష్మిక.ఇక విజయ్‌తో తన ప్రేమ గురించి రష్మిక చెప్పిన మాటలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తమ పెళ్లి నిర్ణయం వెనుక సినిమాల్లో చూపించినట్టుగా భారీ ప్రపోజల్ లాంటిదేమీ కాదని, ఇద్దరం సమయం తీసుకుని, అర్థం చేసుకున్నాకే పెళ్లి చేసుకున్నామన్నారు. జీవితంలో ఎదురయ్యే సంతోషాలు, ఒత్తిళ్లు, ఎత్తుపల్లాల గురించి ఆలోచించే అడుగులు వేశామన్నారు. ప్రేమను నిరూపించడానికి మోకాలిపై కూర్చుని రింగ్ తొడగడమే మార్గం కాదని, అది కేవలం ఒక అందమైన సంప్రదాయం మాత్రమేనంది రష్మిక. అయినా తాను పెళ్లి చేసుకున్న వ్యక్తినే ప్రేమించకపోతే, అసలు ఆ పెళ్లికి అర్థమేంటని ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది రష్మిక. రష్మిక ట్రోలర్స్‌కు తనదైన శైలిలో సమాధానం ఇస్తే.. విజయ్ దేవరకొండ మాత్రం చాలా గట్టిగా ఇచ్చిపడేశాడు. తాను, రష్మిక ఒకవైపు.. ప్రపంచమంతా మరోవైపు, ఎవరో పెట్టిన కామెంట్ల వల్ల తమ బంధంలో బలం ఏమాత్రం తగ్గదన్నాడు విజయ్‌రష్మిక మాటల్లో ప్రేమతో పాటు ట్రోలింగ్‌పై కోపం కనిపిస్తే.. విజయ్ రియాక్షన్‌లో భర్తగా ఆమెకు అండగా నిలబడే ధైర్యం కనిపించింది. విజయ్- రష్మిక జంటకు అభిమానులు కోట్లలో ఉన్నారు. అలాగే వారికున్న ట్రోలర్స్ కూడా



సినిమాలో పద్దతిగా.. బయటేమో మోడ్రన్‌గా

తలైవా రజనీకాంత్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'జైలర్ 2'. సుమారు మూడేళ్ల క్రితం వచ్చి బాక్సాఫీస్ రికార్డులు బద్దలు కొట్టిన 'జైలర్' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి పార్ట్ ను తెరకెక్కించిన నెల్సన్ కుమారే రెండో భాగానికి కూడా దర్శకత్వం వహించాడు. దసరా కానుకగా అక్టోబర్ 15న థియేటర్లలో రిలీజైన 'జైలర్ 2' సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇప్పటికే జైలర్ 2 సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రస్తుతం కలెక్షన్స్ ట్రెండ్ చూస్తుంటే తమిళంలో 1000 కోట్ల కలెక్షన్లు సాధించిన మొదటి సినిమాగా రజనీకాంత్ జైలర్ 2 నిలుస్తుందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.ఇప్పటికే జైలర్ 2 సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రస్తుతం కలెక్షన్స్ ట్రెండ్ చూస్తుంటే తమిళంలో 1000 కోట్ల కలెక్షన్లు సాధించిన మొదటి సినిమాగా రజనీకాంత్ జైలర్ 2 నిలుస్తుందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమాలో చాలా మంది స్టార్స్ యాక్ట్ ఉన్నారు. రమ్యకృష్ణ, విద్యాబాలన్ మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి, మిథున్ చక్రవర్తి, సూరజ్ వెంజరమూడు, యోగిబాబు, మిర్నా మేనన్, రిత్విక్.. ఇలా ఎంతో మంది వివిధ పాత్రలు పోషించారు.సన్ పిక్చర్స్ సంస్థ భారీ బడ్జెట్ తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమాలో చాలా మంది స్టార్స్ యాక్ట్ ఉన్నారు. రమ్యకృష్ణ, విద్యాబాలన్ మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి, మిథున్ చక్రవర్తి, సూరజ్ వెంజరమూడు, యోగిబాబు, మిర్నా మేనన్, రిత్విక్.. ఇలా ఎంతో మంది వివిధ పాత్రలు పోషించారు. కాగా జైలర్, జైలర్ 2 సినిమాల్లో రజనీకాంత్ కోడలిగా నటించి మెప్పించింది మిర్నా మీనన్. మలయాళం సినిమా ఇండస్ట్రీకి చెందిన ఈ ముద్దుగుమ్మ మలయాళంతో పాటు ఎక్కువగా తెలుగు, తమిళ సినిమాల్లోనే నటిస్తోంది. తెలుగులో క్రేజీ ఫెలో, ఉగ్రం, నా సామిరంగ తదితర సినిమాల్లో హీరోయిన్ గా, సెకెండ్ హీరోయిన్ గా చేసిందీ అందాల తార.కాగా జైలర్, జైలర్ 2 సినిమాల్లో రజనీకాంత్ కోడలిగా నటించి మెప్పించింది మిర్నా మీనన్. మలయాళం సినిమా ఇండస్ట్రీకి చెరమ్యకృష్ణ, విద్యాబాలన్ మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్, హృతిక్ రోషన్, విజయ్ సేతుపతి, మిథున్ చక్రవర్తి, సూరజ్ వెంజరమూడు, యోగిబాబు, మిర్నా మేనన్, రిత్విక్.. ఇలా ఎంతో మంది వివిధ పాత్రలు పోషించారు. కాగా జైలర్, జైలర్ 2 సినిమాల్లో రజనీకాంత్ కోడలిగా నటించి మెప్పించింది మిర్నా మీనన్. మలయాళం సినిమా ఇండస్ట్రీకి చెందిన ఈ ముద్దుగుమ్మ మలయాళంతో ందిన ఈ ముద్దుగుమ్మ మలయాళంతో పాటు ఎక్కువగా తెలుగు, తమిళ సినిమాల్లోనే నటిస్తోంది. తెలుగులో క్రేజీ ఫెలో, ఉగ్రం, నా సామిరంగ తదితర సినిమాల్లో హీరోయిన్ గా, సెకెండ్ హీరోయిన్ గా చేసిందీ అందాల





ప్రభాస్ బర్త్ డేకు అదిరిపోయే ట్రీట్.. ఫౌజీ అప్డేట్ ఇచ్చిన నిర్మాత..

మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్ నిర్మాణంలో తెరకెక్కుతున్న "దొంగ నా కొడుకు" చిత్రం టీజర్ విడుదల కార్యక్రమం సినీ వర్గాలలో ఆసక్తిని రేకెత్తించింది. ఈ సందర్భంగా నిర్మాత వై. రవి శంకర్ మాట్లాడుతూ, ఈ చిత్రం నవంబర్ 13న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుందని అధికారికంగా ప్రకటించారు. చిల్డ్రన్స్ డేకి ముందు విడుదల కావడంతో ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తుందని, భారీ విజయం సాధిస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. దర్శకుడు శ్రీను కంబాల రూపొందించిన కథ హాస్యాన్ని ప్రధానంగా నిలుపుకుంటుందని, కథ వినగానే చాలా సంతోషించామని తెలిపారు. యువ కథానాయకుడు మౌళి తన క్యారెక్టరైజేషన్‌తో సినిమా అంతటా ప్రేక్షకులను అలరిస్తారని, టైటిల్‌కు తగ్గట్లుగా అతను చేసే అల్లరి చిల్లరి పనులు సరదాగా ఉంటాయని పేర్కొన్నారు. "లిటిల్ హార్ట్స్" తర్వాత మౌళి సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని చెప్పారుమైత్రీ మూవీ మేకర్స్ సంస్థ విభిన్నమైన జోనర్‌లలో సినిమాలు నిర్మిస్తూ వస్తోంది. రవి శంకర్ మాట్లాడుతూ, "ఇదివరకు ఒక ఎమోషనల్ సినిమా అయ్యింది. ఇమ్మీడియట్‌గా విడుదలైన రణబలి ఒక చరిత్ర, ఒక ధీరుడి కథ అయ్యింది. అలాగే నెక్ట్స్ ఈ ఫ్రైడే విడుదలయ్యే 401 ఒక హారర్ కథ. ఆ లెక్కన వెంటనే విడుదల చేసే దొంగ నా కొడుకు ఒక ఎంటర్టైన్మెంట్ కథ. ఇలా డిఫరెంట్ జోనర్స్ సినిమాలు వరుసనే అలా రావటం మా సంస్థలో కూడా చాలా ఆనందంగా ఉంది. అంటే అన్ని రకాల జోనర్లను టచ్ చేస్తున్నాం" అని తమ నిర్మాణ సంస్థ వైవిధ్యాన్ని నొక్కి చెప్పారు. "దొంగ నా కొడుకు" థియేటర్లలో పెద్ద విజయం సాధిస్తుందని, ప్రేక్షకులు తప్పకుండా చూడాలని కోరారు.ఈవెంట్ సందర్భంగా మీడియా ప్రతినిధులు, ప్రభాస్ నటిస్తున్న "ఫౌజీ", రామ్ చరణ్ 17వ సినిమా గురించిన అప్‌డేట్‌ల కోసం రవి శంకర్‌ను అడిగారు. దీనిపై స్పందిస్తూ, అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా "ఫౌజీ" సినిమా కథ, హీరో పాత్ర గురించి తెలియజేసే ఒక చిన్న వీడియోను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇది "బాహుబలి"



ఆ ఒక్క పని చేయకపోవడమే బెస్ట్.. డబ్బు సంపాదనలో ఇదే మంచి సలహా..

ప్రముఖ నటుడు, రచయిత హర్షవర్ధన్ ఇటీవలి ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో డబ్బు, ఆర్థిక నిర్వహణ, కుటుంబ సంబంధాలపై తన వ్యక్తిగత అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు. ముఖ్యంగా, ఆర్థిక భద్రత, తల్లిదండ్రులతో అనుబంధంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఆకట్టుకున్నాయి. హర్షవర్ధన్ తన జీవితంలో జువీ×లకు ప్రాధాన్యత ఇవ్వరని స్పష్టం చేశారు. ఏదైనా వస్తువు కొనుగోలు చేసేటప్పుడు మొత్తం చెల్లించి కొనుగోలు చేయడానికే తాను ఇష్టపడతానని తెలిపారు. అయితే, ఇది ఆర్థికంగా సరైన పద్ధతి కాదని ఇటీవలి కాలంలో గ్రహించానని పేర్కొన్నారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ వంటి వాటి ద్వారా తాను ఆర్థిక విషయాలపై అవగాహన పెంచుకుంటున్నానని చెప్పారు. ఉదాహరణకు, పది లక్షల విలువైన కారును ఒకేసారి కొనే బదులు, కొంత డౌన్ పేమెంట్ చెల్లించి, మిగిలిన మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడిగా పెడితే కాలక్రమేణా ఎక్కువ లాభం వస్తుందని, దానితో కారు దాదాపు ఉచితంగా వచ్చినట్టవుతుందని వివరించారు. తనకు ఆర్థిక భారం ఉండకూడదనేది ప్రధాన లక్ష్యమని, డబ్బు కోసం ఇష్టం లేని పనులు చేయకూడదనే సిద్ధాంతాన్ని పాటిస్తానని ఆయన వెల్లడించారు. ప్రస్తుతం తాను ఇష్టం లేని పనులు చేస్తున్నా, అవి డబ్బు కోసం కాదని, మొహమాటమో లేక మరొక అవకాశమో కావచ్చని తెలిపారు.



ఐపీఎస్ నిత్యారెడ్డిగా సాయిపల్లవి..

పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో న్యాచురల్ బ్యూటీ.. మూవీ రిలీజ్ ఎప్పుడంటే?

వెర్సటైల్ స్టార్ హీరో ధనుష్ కథానాయకుడిగా.. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న భారీ పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఓం - - చాప్టర్ 1: ఉధిరం -- ది బ్లడ్ వుడ్' నుంచి హీరోయిన్ సాయిపల్లవి క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియో విడుదలైంది. ఈ సినిమాలో ఆమె నిత్యారెడ్డి అనే పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటివరకు చేయని విభిన్నమైన పాత్రలో సాయిపల్లవి ఆకట్టుకుంటున్నారు. పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఆమె తనదైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సాయి పల్లవి పాత్ర విషయానికి వస్తే.. నిత్యారెడ్డి తెలివితేటలు, నిజాయతీ, అనుభవం ఉన్న యువ పోలీస్ ఆఫీసర్‌గా పరిచయమైంది. గతంలో సీబీఐ, ఇంటర్‌పోల్‌లో పనిచేసిన ఆమె.. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చేపట్టిన 'ఆపరేషన్ ఓం'ను ఆమె లీడ్ చేస్తుంది. ఈ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలో సాయిపల్లవి పవర్‌ఫుల్, ఇంటెన్స్ లుక్‌లో ఆకట్టుకున్నారు. అధికారాన్ని ప్రతిబింబించే బాడీ లాంగ్వేజ్, లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో పాటు నిత్యారెడ్డి పాత్రలోని విభిన్న కోణాలను ఈ వీడియోలో చూపించారు. సహజమైన నటన, హావభావాలతో ప్రేక్షకులను మెప్పించే సాయిపల్లవి.. నిత్యా రెడ్డి పాత్రతో మరో కొత్త సవాల్‌ను స్వీకరించారు. ఈ పాత్ర కోసం ఆమె చేసిన అద్భుతమైన మేకోవర్, పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ధనుష్ 'ఓం ఫస్ట్ స్ట్రైక్', మమ్ముట్టి 'బర్మా కార్తికేయన్' క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలకు అభిమానుల నుంచి ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే ఈ మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ సింగిల్‌తో పాటు ఇటీవల వచ్చిన రెండో పాట 'వీళా వీరా' కూడా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. సాయి అభ్యంకర్ స్వరపరిచి, ఆలపించిన ఈ పాటకు టిప్పు స్వరం కూడా మరింత ప్లస్ అయ్యింది. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఈ పాటను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సాయిపల్లవి క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియో విడుదల కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది.ఆర్ టేక్ స్టూడియోస్ బ్యానర్‌పై శ్రద్ధా అగర్వాల్ నిర్మిస్తోన్న ఈ సినిమాను ధనుష్‌కు చెందిన వండర్‌బార్ ఫిల్మ్స్‌తో కలిసి రూపొందిస్తున్నారు. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ధనుష్, మమ్ముట్టి, సాయిపల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. కె. ఎళిల్ అరసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, ఆర్. కళైవానన్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఎ. పన్నీర్‌సెల్వం ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. యానిక్ బెన్, కేచా ఖంపక్డీ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ అందించారు. భారీ తారాగణం, పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఇంట్రడక్షన్ వీడియోలు, ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచుతున్న పాటలతో 'ఓం -- చాప్టర్ 1: ఉధిరం -- ది బ్లడ్ వుడ్' ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా యాక్షన్ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తోంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20, 2026న థియేటర్లలో విడుదల కానుంది.

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224